
దిక్సూచి DIKSUCHI

మిస్సింగ్ నంబర్ టెస్ట్

రీజనింగ్

పార్ట్-3

1. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 162 బి) 136 సి) 145 డి) 174

సమాధానం: (ఎ)

వివరణ : ప్రతి డయాగ్రమ్ పై అంకెల లబ్ధం, కింది అంకెల లబ్ధాలను కూడితే వృత్తం మధ్యలోని సంఖ్య వస్తుంది.

8x4x2=64 7x1x6=42 9x4x2=72


3x6x5=90 8x2x5=80 6x5x3=90



64+90=154 42+80=122 72+90=162

కాబట్టి సమాధానం అవుతుంది.

2. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 229 బి) 349 సి) 254 డి) 529


సమాధానం: (ఎ)

వివరణ : పైన వృత్తంలో అంకెలను ఒక సమూహంగా, వృత్తానికి కింద గల అంకెను ఒక సమూహంగా రాసుకొని తీసివేసిన వృత్తంలో సంఖ్య వస్తుంది.

426-351=75, 756-543=213

కాబట్టి 574-345=229

3. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 32 బి) 48 సి) 56 డి) 71

సమాధానం: (సి)


వివరణ : చతురస్రానికి నాలుగు వైపుల గల అంకెల లబ్దాన్ని 10తో భాగిస్తే చతురస్రంలోని సంఖ్య వస్తుంది.

$5\times4\times2\times3=\frac{120}{10}=12$

$8\times3\times5\times6=\frac{720}{10}=72$

కావున $7\times4\times10\times2=\frac{560}{10}=56$ సమాధానము అవుతుంది.

4. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 51 బి) 84 సి) 60 డి) 96

సమాధానం: (ఎ)

వివరణ : వృత్తానికి నాలుగు వైపుల గల విడివిడి అంకెల వర్గాలను కూడితే వృత్తంలోని సంఖ్య వస్తుంది.

62+32+102+92=226

82+62+72+22=153

52+12+42+32=51

5. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?

L_{12}	N_{34}	M_{16}
M_{24}	L_{30}	N_{33}
N_{6}	M_{8}	?

ఎ) L7 బి) N6 సి) M4 డి) L6

సమాధానం : (ఎ)

వివరణ : ప్రతి వరుసలో నిలువుగా అడ్డంగా ఔ, ఖ్రా ప్రతి వరుసలోను వస్తున్నాయి. కాబట్టి 3వ వరుస చివర ఔ రావాలి. ప్రతి వరుసలో నిలువుగా గల మొదటి రెండు సంఖ్యల మొత్తం.

12+14=36 36 అనేది 62


34+30=64 64 అనేది 82

అదే విధంగా

16+33=49 49 అనేది 72

కావున సమాధానం ఔ7

6. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 55 బి) 46 సి) 62 డి) 58

సమాధానం: (ఎ)

వివరణ : మొదటి డయాగ్రామ్‌లో

52 + 72 = 25 + 49 = 74 - 32 = 42

రెండో డయాగ్రామ్‌లో

62 + 42 = 36 + 16 = 52 - 25 = 27

కాబట్టి మూడో డయాగ్రామ్‌లో

92 + 32 = 81 + 9 = 90 - 35 = 55 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

గగన్‌యాన్



అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపి, వారిని క్షేమంగా తిరిగి భూమికి తీసుకువచ్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తొలిసారి చేపట్టబోతున్న ప్రయోగమే 'గగన్‌యాన్'

భారత అంతరిక్షరంగ పరిశోధనలను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు, భవిష్యత్తులో 2035 నాటికి అంతరిక్షంలో సొంత స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసుకొనేందుకు, 2040 నాటికి మానవ సహిత చంద్రమండల యాత్రకు సంసిద్ధమయ్యేందుకు గగన్‌యాన్‌ను ఒక నాంది ప్రస్థానంగా చెప్పుకోవచ్చు. 2006లో పునాది పడిన ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రమారమి పదివేల కోట్లు.

వివిధ దశల్లో భద్రత పరీక్షలు

2025లో చేపట్టనున్న ఈ ప్రయోగానికి ముందు భద్రతపరంగా మరో రెండు డమ్మీ ప్రయోగాలను ఇస్రో చేపట్టనుంది. 2024 జూలైలో జీ1(గగన్‌యాన్-1) ద్వారా 'వ్యోమమిత్ర' అనే రోబోను కలిగి ఉన్న తొలి గగన్‌యాన్ క్యాప్సూల్ ఆర్బిటాల్ టెస్ట్ ఫ్లయిట్‌ను, 2024 డిసెంబర్‌లో జీ2(గగన్‌యాన్-2) అనే రెండో గగన్‌యాన్ క్యాప్సూల్ ఆర్బిటాల్ టెస్ట్ ఫ్లయిట్‌ను పంపనున్నారు. 2025లో జీ3 అనే మూడో దానితో ఈ డమ్మీ ప్రయోగాలు ముగుస్తాయి. ఇవేకాక మరో 20 రకాలైన భద్రతా ప్రయోగాలూ ఇస్రో చేపట్టనుంది. చివరిగా వ్యోమగాములతో కూడిన గగన్‌యాన్ ప్రయోగాన్ని 2025 చివరినాటికి చేపట్టనున్నారు.

గత అక్టోబరులో టెస్ట్ వెహికల్ డెమాన్‌స్ట్రేషన్-1(టీవీ-డీ1) (లేదా) టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్-1 అని పిలిచే ప్రయోగాన్ని చేపట్టి 'క్రూ ఎస్కేప్ సిస్టమ్' పనితీరును ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే వ్యోమగాములు ఉండే క్రూ మాడ్యూల్‌ను రాకెట్ నుంచి వేరుచేసి, సురక్షితంగా భూమిపైకి తీసుకువచ్చే ప్రక్రియే 'క్రూ ఎస్కేప్ సిస్టమ్'. దీనికి అత్యంత వేగంగా ప్రతిస్పందించే 'క్విక్ రియాక్టింగ్ సాలిడ్ మోర్టార్'లను ఇస్రో అభివృద్ధి చేసింది. ఇవి చాలా వేగంగా ప్రజ్వరిల్లి అధిక థ్రస్ట్‌ను ఉత్పత్తి చేస్తాయి. తద్వారా ప్రమాద సమయాల్లో క్రూ మాడ్యూల్ తక్షణం రాకెట్ నుంచి వేగంగా విడివడి భూమి వైపు ప్రయాణించడానికి వీలవుతుంది. ఈ క్రమంలో వివిధ దశల్లో శక్తివంతమైన పారాచూట్‌లు విచ్చుకొని క్రూ మాడ్యూల్‌ను సురక్షితంగా బంగాళాఖాతంలో జారవిడుస్తాయి.

అనంతరం ఇండియన్ నేవి ఈ క్రూమాడ్యూల్‌ను వెలికితీస్తుంది. ఈ టీవీ-డీ1 ప్రయోగం ద్వారా వ్యోమగాములు లేని డమ్మీ క్రూ మాడ్యూల్‌ను వినియోగించి ఈ ప్రక్రియను విజయవంతంగా పరీక్షిస్తారు.

అదేవిధంగా వ్యోమగాముల భద్రతను దృష్టిలో ఉంచుకొని గగన్‌యాన్-1 డమ్మీ ప్రయోగంలో భాగంగా తొలుత వ్యోమగాముల స్థానంలో 'వ్యోమమిత్ర' అనే హ్యూమనాయిడ్ రోబోను క్రూ మాడ్యూల్‌లో ఉంచి అంతరిక్షంలోకి పంపనున్నారు. తద్వారా ఈ రోబో, మైక్రో గ్రావిటీ ఎక్స్‌పెరిమెంట్స్, మాడ్యూల్ పారామీటర్స్‌ను పరీక్షించి వ్యోమగాములు ఏదైనా అసౌకర్యానికి, ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉంటే గుర్తిస్తుంది.

వివిధ సంస్థల సహకారం

ఈ ప్రయోగంలో భాగంగా అంతరిక్షంలోకి పంపేందుకు నలుగురు వ్యోమగాముల ను ఎంపిక చేశారు. వీరు గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ శుభాన్షు శుక్లా ఉన్నారు. భారతదేశంలో వ్యోమగాముల శిక్షణ సౌకర్యాలకు సంబంధించిన సాంకేతిక వ్యవస్థల కొరత కారణంగా ఇస్రో, రష్యా స్పేస్ ఏజెన్సీ 'రాస్ కోస్ మాస్' అనుబంధ సంస్థ 'గ్లావ్ కోస్ మాస్'తో ఒప్పందం చేసుకొని ఫిబ్రవరి 2020 - మార్చి 2021 మధ్యకాలంలో ఈ నలుగురు వ్యోమగాములకు అంతరిక్ష పరిస్థితుల్లో మనుగడ సాగించేందుకు అవసరమైన తర్ఫీదును ఇప్పించారు.

అంతేకాక ఈ గగన్‌యాన్ మిషన్‌లో అనేక భారతీయ సంస్థలు కూడా సాంకేతిక, పరిశోధన, అభివృద్ధిపరంగా విస్తృత సేవలు అందిస్తున్నాయి. అవి- ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ నేవి, భారత వాతావరణ సంస్థ, ఇండియన్ కోస్ట్‌గార్డ్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, సిఎస్ఐఆర్ ల్యాబ్స్, అనేక విద్య పారిశ్రామిక సంస్థలు.

●



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

గగన్‌యాన్-ప్రయోజనాలు

- గగన్‌యాన్ విజయవంతమైతే వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే సామర్థ్యం సాధించిన అమెరికా, రష్యా చైనా సరసన భారత్ కూడా సగర్వంగా చేరుతుంది.
- గగన్‌యాన్ ప్రయోగ విజయం తదుపరి భారతదేశ మానవసహిత అంతరిక్ష ప్రయోగాలపరంగా, ఖగోళ అన్వేషణపరంగా చేపట్టబోయే అనేక ప్రాజెక్టుకు ఊతమవుతుంది.
- అంతర్జాతీయంగా భారతదేశ సాఫ్ట్‌పవర్ ఇనుమడించి, అంతర్జాతీయ దౌత్య, వ్యూహాత్మక సంబంధాలను బలపరుస్తుంది.
- శాస్త్ర, సాంకేతిక రంగాలపైకి విద్యార్థుల ఆసక్తిని మళ్లించడానికి ఉపకరిస్తుంది. తద్వారా భావితరాల వైజ్ఞానిక నైపుణ్యాలు మరింత మెరుగవుతాయి. నవకల్పనలకు దారితీస్తుంది.
- అనేక రంగాల సమన్వయంతో, సహకారంతో జరుగుతున్న ఈ ప్రయోగం వల్ల భారీ స్థాయిలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.
- దేశీయంగా రూపొందించిన వాహకనౌక, సాంకేతికతలు గల ఈ ప్రయోగం దేశ ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా సామర్థ్యాలను చాటిచెబుతుంది.

ప్రయోగం-దశలు

'జీఎస్ఎల్‌వీ ఎంకె-3(ఎల్‌వీఎం-3)' లాంచ్ వెహికల్ ద్వారా ఆర్బిట్ మాడ్యూల్‌ను శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగకేంద్రం నుంచి ప్రయోగిస్తారు. ఇది భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న లోఎర్త్ ఆర్బిట్(దిగువ భూకక్ష్య)లోకి ఆర్బిట్ మాడ్యూల్‌ను 16 నిమిషాల్లో ప్రవేశపెడుతుంది. ఈ కక్ష్యలో వ్యోమగాములతో కూడిన, భూమిని పోలిన వాతావరణం ఉంటే క్రూ మాడ్యూల్, క్రూ మాడ్యూల్‌కు సాంకేతిక సహకారం అందించే సర్వీస్ మాడ్యూల్‌ల కలయిక అయిన ఆర్బిట్ మాడ్యూల్ మూడు నుంచి ఏడు రోజులపాటు(పరిస్థితులను బట్టి) ఉంటుంది. తదుపరి దిశ మార్చుకొని, భూమిపైకి తిరిగి రావడానికి సమాయత్తం అవుతుంది. భూమికి తిరిగి రావడానికి కావాల్సిన త్వరణం కోసం డీబూస్ట్ ప్రక్రియ ప్రారంభమై సర్వీస్ మాడ్యూల్ నుంచి క్రూ మాడ్యూల్ వేరుపడుతుంది. తదుపరి పారాచూట్స్ విచ్చుకొని క్రూ మాడ్యూల్‌ను భూమి వైపుగా తరలించి గుజరాత్ వద్ద అరేబియా సముద్రంలో పడుతుంది. క్రూ మాడ్యూల్ నుంచి వ్యోమగాములను రికవరీ ఆపరేషన్ ద్వారా నేవిదళం సురక్షితంగా వెలికితీయడంతో గగన్‌యాన్ ప్రయోగం సంపూర్ణమవుతుంది. డీబూస్ట్ తరవాత 36 నిమిషాల వ్యవధిలో క్రూ మాడ్యూల్ సముద్రంలో పడటం జరుగుతుంది.

శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం





శ్రీకాళహస్తి మార్చి 3: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి క్షేత్రంలో ఆదివారం జరిగిన భక్తకన్నప్ప ధ్వజారోహణంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. 14 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు క్షేత్ర సంప్రదాయం ప్రకారం పరమశివుడి భక్తుడైన కన్నప్పకే తొలి పూజ చేశారు. ముక్కంటి ఆలయంలోని అలంకార మండపం నుంచి భక్తకన్నప్ప ఉత్సవ మూర్తిని కొండపైకి ఊరేగించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, సకల దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తూ వేదోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం చేశారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని తెలంగాణ, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు ఆదివారం దర్శించుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ వెంకటరమణ

నరసరావుపేటలో వలంటీర్లకు నగదు పంపిణీ

ఒక్కొక్కరికీ కవర్‌లో రూ. 5 వేలు

- ఉదయం కవర్లపై ఎమ్మెల్యే స్టాంప్.. రాత్రికిచ్చినవాటిపై మాత్రం మాయం
- పెదకూరపాడు, వినుకొండల్లో యథేచ్ఛగా చీరెలు, కుక్కర్ల పంపిణీ
- పల్నాడులో వైసీపీ ఎమ్మెల్యేల ప్రలోభపర్వం
- ఈసీ పట్టించుకోవడం లేదని విపక్షాల ఆగ్రహం

నరసరావుపేట, మార్చి 3: పల్నాడు జిల్లాలో బహిరంగంగానే ఎన్నికల తాయిలాల పంపిణీకి వైసీపీ ఎమ్మెల్యేలు బరితెగించారు. కొద్దిరోజుల కిందట పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ఓటర్లకు చీరెలు, కుక్కర్లు మొదలైనవి పంపిణీ చేశారు. ఇప్పుడు నగదు పంపిణీకి శ్రీకారం చుట్టారు. నరసరావుపేటలో ఆదివారం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఒక్కో వలంటీరుకు రూ.5 వేల నగదు కవర్ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఉదయం కవర్లపై ఎమ్మెల్యే స్టాంప్ ఉండగా, రాత్రికి ఇచ్చిన కవర్లపై స్టాంప్ లేదని వారు చెబుతున్నారు. ఈ భేటీలో ఎన్నికల్లో వైసీపీ కోసం ఎలా పని చేయాలో ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే వలంటీర్లు ఉండరని.. అందుచేత వైసీపీని మళ్లీ గద్దెనెక్కించేందుకు వారు కృషి చేయాలని, అలాగే సంక్షేమ పథకాలను పొందుతున్న లబ్ధిదారులను ప్రభావితం చేసేలా పనిచేయాలని ఆయన సూచించినట్లు పలువురు వలంటీర్లు తెలిపారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఉండవంటూ ఓటర్లకు తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే వార్డుల్లోని నేతలతో టచ్‌లో ఉండాలని ఆదేశించారని అంటున్నారు. బాహాటంగానే ప్రలోభాల పర్వం కొనసాగిస్తున్నా ఎన్నికల సంఘం (ఈసీ) పట్టించుకోవడంలేదని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.



రాత్రి పంపిణీ చేసిన నగదు కవర్‌పై స్టాంప్ లేని వైనం

రూ.300 దర్శన క్యూలైన్ వద్ద స్వల్ప అగ్నిప్రమాదం

తిరుమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం భక్తులు ప్రవేశించే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్‌కు సమీపంలోని ఓ గదిలో ఆదివారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పింది. క్యూలైన్‌కు సమీపంలో విద్యుత్, ఇతర వస్తువులను భద్రపరిచే గది నుంచి ఆదివారం మధ్యాహ్నం పొగలు రావడాన్ని దగ్గర్లో ఉన్న భద్రతా సిబ్బంది గుర్తించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు ఫైర్ ఇంజన్‌తో ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. లోపలున్న వస్తువులను వెలుపలకు తీసుకొచ్చారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగినట్టు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



ముక్కంటి ఆలయంపై ఎగిరిన డ్రోన్

- శనివారం అర్ధరాత్రి వీడియోల చిత్రీకరణ
- పోలీసుల అదుపులో ఐదుగురు తమిళనాడు యువకులు

శ్రీకాళహస్తి, మార్చి 3: తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయంపై ఓ డ్రోన్ కెమెరాతో తమిళనాడుకు చెందిన ఐదుగురు యువకులు వీడియోలను చిత్రీకరించారు. వీరిని ఆలయ సెక్యూరిటీ గుర్తించి పోలీసులకు అప్పగించారు. చెన్నైకి చెందిన విఘ్నేష్, అజిత్ కన్నన్, శంకర్ శర్మ, అరవింద్, పోర్చే జీఎన్ తిరుమల శ్రీవారిని దర్శించుకునిశనివారం రాత్రి శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ముక్కంటి ఆలయానికి సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు అతిథి గృహంలో గది అద్దెకు తీసుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆరంభం కావడంతో ఆలయ పరిసరాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. వీటన్నింటినీ చిత్రీకరించాలని ఆ యువకులు భావించారు. తాముంటున్న అతిథి గృహం భవనం పైనుంచి డ్రోన్ కెమెరాతో అర్ధరాత్రి ప్రధాన ఆలయంలో చిత్రీకరించారు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ఆలయ అధికారులకు సమాచారం అందించారు. ఆ తర్వాత డ్రోన్‌ను వెంబడించి యువకులను గుర్తించారు. శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు.

పాత పెన్షన్ విధానాన్ని తెచ్చే పార్టీకే ఓటు: యూటీఫ్

విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్), మార్చి 3: ఏ పార్టీ అయితే పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు హామీ ఇస్తుందో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకే తమ ఓటు ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ తెలిపారు. విజయవాడలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర సంఘం రూపొందించిన ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోహర్ కుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ పునరుద్ధరణను మేనిఫెస్టోలో పెట్టిన పార్టీలకే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యుల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.



ట్రోఫీతో ఏపీ హైకోర్టు క్రికెట్ జట్టు సభ్యులు

హైకోర్టు ఉద్యోగుల క్రికెట్ మ్యాచ్‌లో విజేతగా ఏపీ జట్టు

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ హైకోర్టు ఉద్యోగుల మధ్య మంగళగిరి అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఏపీ జట్టు 18 పరుగులతో విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఏపీ జట్టు 20 ఓవర్లలో 126 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తెలంగాణ జట్టు 108 పరుగులకు ఆలౌటైంది. అంతకు ముందు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. మ్యాచ్‌లో విజయం సాధించిన ఏపీ జట్టుకు ఏపీ హైకోర్టు ప్రోటోకాల్ రిజిస్ట్రార్ ఏవీ రాఘవస్వామి ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన తెలంగాణ జట్టుకు ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్ కప్ అందించారు.

నేటి నుంచి 'పది' హాల్ టికెట్లు

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులు సోమవారం నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పేరు, పుట్టిన తేదీ వివరాలు ఇచ్చి www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునే వీలుందన్నారు. అలాగే పాఠశాల కోడ్, పాస్‌వర్డ్‌తో ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో చదివే టెన్త్ విద్యార్థుల హాల్ టిక్కెట్లు పొందవచ్చన్నారు. ఈ నెల 18 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఇస్రో ఛైర్మన్‌కు పిన్నమనేని ఫౌండేషన్ పురస్కారం


విజయవాడ (మొగల్రాజపురం), మార్చి 3 : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఛైర్మన్ ఎస్.సోమనాథ్‌కు ప్రతిష్ఠాత్మక పిన్నమనేని ఫౌండేషన్ పురస్కారం అందిస్తున్నట్టు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు చెప్పారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1989 నుంచి తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక, కళారంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులను గౌరవిస్తున్నామని, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులకు పురస్కారాలను అందిస్తున్నామన్నారు. ఫౌండేషన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది ఇస్రో ఛైర్మన్ సోమనాథ్‌కు ఈ పురస్కారం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కాగా, పిన్నమనేని పురస్కార ప్రదానోత్సవం సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 6వ తేదీన జరుగుతుందని ప్రకటించారు.


ఉక్కు పరిరక్షణకు మహా పాదయాత్ర

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం మహా పాదయాత్ర నిర్వహించారు. కూర్మన్నపాలెం రిలే నిరాహార దీక్షల శిబిరం నుంచి ఉదయం 6.15 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర వడ్లపూడి, శ్రీనగర్, గాజువాక, ఆటోనగర్, షీలానగర్, కాకానినగర్, ఎన్ఏడీ మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన పీఏసీ కమిటీ సభ్యుడు కోన తాతారావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సీహెచ్ నరసింగరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు కేవీ సత్యనారాయణమూర్తి, డి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. పాదయాత్రకు సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకుడు ఎం.శ్రీభరత్ సంఘీభావం ప్రకటించారు.



మహా పాదయాత్ర నిర్వహిస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు, కార్మికులు





రాయితీకి.. రాం..రాం

- ఉద్యాన రైతులకు అందని ప్రభుత్వ ప్రోత్సాహం



- కాలయాపనతోనే సరి
- ఏళ్లు గడుస్తున్నా దక్కని మోక్షం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.14 కోట్లు పెండింగ్
- మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారిపోతోన్న రైతులు

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమమే మా ధ్యేయం.. మాది రైతుల ప్రభుత్వం.. అంటూ పాలకులు తరచూ ప్రకటించుకుంటారు. కానీ చేతల్లో మాత్రం అమలు చేయడంలేదు. రాయితీల విషయంలో ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి సంప్రదాయ పద్ధతులను విడనాడి కొత్త రకం సాగు, పంటలు వైపు పెద్దసంఖ్యలో మళ్లారు. అయితే వారి మాటలు నమ్మి సంప్రదాయ పద్ధతులను విడనాడిన రైతులు తరచూ వంచనకు గురవుతున్నారు. ఈ కోవలోనే ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు నిలువునా మునిగిపోయారు. సంప్రదాయ పద్ధతులను విడనాడితే అందుకు కావాల్సిన ప్రోత్సాహకాలను అందిస్తుందని పాలకులు నమ్మబలికి మూడేళ్లు గడుస్తోంది. కానీ రైతులకు చెల్లించాల్సిన బకాయిలకు మాత్రం మోక్షం కలగడంలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి రైతులు వేసారి పోతున్నారు తప్పితే బకాయిల విషయంలో ప్రభుత్వం వైపు నుంచి చలనం కరువైంది. చెల్లించాల్సిన వాటి ఊసెత్తని ప్రభుత్వం కొత్త పథకాలు అంటూ ఊదరగొడుతూ ఉద్యాన రైతులను మరోమారు వంచించే కార్యక్రమానికి పాలకులు తెరతీశారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఉద్యాన రైతులు తమకు చెల్లించాల్సిన రాయితీ సొమ్ము కోసం దాదాపు మూడేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు. మాటలతో కాలక్షేపం చేస్తున్నారే తప్పితే పాలకులు రూపాయి విదిల్చకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. మూడు జిల్లాల్లో కలిపి దాదాపు రూ.14 కోట్ల వరకు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఇందులో ఒక్క బాపట్ల జిల్లా వాటానే దాదాపు రూ.6.50 కోట్లు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. బకాయిలకు సంబంధించి త్వరలోనే విడుదల చేయడంతో పాటు ఉద్యాన రైతులకు అందించే ప్రోత్సాహకాల విషయంలో సరికొత్త పాలసీ తెస్తామని గతేడాది ప్రభుత్వ పెద్దలు చెప్పారు. ఆ బకాయిలకు మోక్షం లభించకపోగా కొత్త పాలసీ అంటూ ఉద్యాన రైతులను మభ్యపెట్టే కార్యక్రమానికి ప్రభుత్వం తెరతీయడం గమనార్హం. మిగిలిన పంటలతో పోలిస్తే ఉద్యాన సాగుకు కొంచెం పెట్టుబడి అదనంగా పెట్టాలి. మేలైన విత్తనాల కోసం షేడ్‌నెట్, పాలీహౌస్ వంటివి రైతు లకు అవసరం. దీంతో ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందు బాటులోకి తెచ్చింది. వీటితో పాటు మల్చింగ్ షీట్లు కూడా అవసరం అవుతాయి. ఈ పరిస్థితుల్లో టీడీపీ హయాంలో రాయితీలను సకాలంలోనే అందించడంతో పెట్టుబడి భారం రైతులకు తెలిసేది కాదు. దీనితో ఏటికేడు ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం గతంలో పెరుగుతూ వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంతో మొత్తం పడకేసింది. గడచిన ఆర్థిక సంవత్సరంలో బాపట్ల జిల్లాకు రూ.25 కోట్లతో ప్రత్యేక రాయితీలు ఉద్యాన రైతులకు అందిస్తామని పాలకులు చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి.

68,000 హెక్టార్లలో సాగు..

ఉద్యాన పంటల సాగు విషయానికొస్తే ఒక్క బాపట్ల జిల్లాలోనే 29,500 హెక్టార్ల వరకు సాగవుతుందనేది అంచనా. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అయితే ఈ సంఖ్య 68,000 హెక్టార్లుగా ఉంటుంది. ఈ మొత్తంలో 19,000 హెక్టార్ల వరకు మిరపే సాగవుతుండగా మిగిలిన దానిలో అత్యధిక భాగం కూరగాయలు, పండ్ల తోటలు ఉన్నాయి. గడచిన టీడీపీ ప్రభుత్వంలో ఉద్యాన పంటల సాగుకు అందించే రాయితీలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాయితీ సొమ్మును సకాలంలో చెల్లించేవారు. దీంతో 2014--2019 మధ్య కాలంలో ఉద్యాన పంటల సాగు విషయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా భారీగా వృద్ధి నమోదైంది. ఇదే ఒరవడి కొనసాగి ఉంటే ఉద్యాన పంటల సాగు లక్ష హెక్టార్లకు చేరుకుని ఉండేది. అయితే ప్రభుత్వం శీతకన్ను వేయడంతో ఉద్యాన సాగు తిరోగమనం వైపు పయనిస్తోంది.

మ్యాచింగ్ గ్రాంటు విషయంలోనూ అంతే...

రైతులకు అందించే రాయితీల విషయంలో కేంద్రం వాటాకు రాష్ట్ర ప్రభుత్వం వాటా జమ చేయాలి. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం 40 శాతం. అయితే కేంద్రం అందించే నిధులను వేరే అవసరాలకు దారి మళ్లించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కింది. ఇది గమనించిన కేంద్రం గతేడాది నుంచి ఆ రాయితీను ప్రత్యేక ఖాతాలకు జమ చేయడం ప్రారంభించింది. దీని మూలంగానే కొద్దిమేర చెల్లింపులు జరిగాయి. లేకుంటే ఈ బకాయిల మొత్తం మరింతగా ఉండేదని అన్నదాతలు చెబుతున్నారు.

6లో..

కీచక ఉపాధ్యాయుడి సస్పెన్షన్

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



మహా శివరాత్రికి 182 స్పెషల్ ఆర్టీసీ బస్సులు
- డీపీటీవో రవికాంత్

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దింపారు
- 1538వ రోజుకు రైతుల ఆందోళనలు

కుళాయి.. కష్టం

- నత్తనడకన జల్‌జీవన్

నిధుల లేమి.. పనులు నత్తనడకతో జల్‌జీవన్ మిషన్ జాప్యం జరుగుతోంది. కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీటిని ప్రతిఒక్కరికీ అందించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం కష్టంగా మారింది. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనా రాష్ట్ర ప్రభుత్వం వాటిని మంజూరు చేయడంలేదు. దీంతో జల్‌జీవన్ మిషన్ పనులు చాలాదగ్గర్ల ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రోజులు.. నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. నిధుల కొరత వెంటాడుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ప్రతిఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని సీఎం జగన్ ఆర్భాటంగా ప్రకటించినా క్షేత్ర స్థాయిలో అది అమలు కాలేదు. 2019లో ఈ పథకాన్ని అమలుల్లోకి తీసుకొచ్చినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జల్‌జీవన్ పథకం ఉమ్మడి గుంటూరు జిల్లాలో నత్తనడకన సాగుతుంది. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే లక్ష్యాల మేర పనులు జరుగుతున్న పరిస్థితులు కానరాడంలేదు.

- ఇంటింటికీ రక్షిత నీరు కరువు
- పల్లెల్లో తీరని తాగునీటి వెతలు
- నిధుల కొరతతో సాగని పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

స్వచ్ఛమైన.. సురక్షితమైన.. తాగునీటిని ప్రతి ఒక్కరికీ అందించాలి. ప్రధానంగా ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం భారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి కుళాయిల ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను చేపట్టింది. దీంతో కేంద్ర ప్రభుత్వ లక్ష్యమైన కుళాయిల ద్వారా తాగునీరు అందివ్వడం కష్టంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరి సగం నిధులతో జల్‌జీవన్ మిషన్ పనులు చేపట్టే విధంగా 2019లో ప్రణాళికను రూపొందించారు. ఇందుకు రూ.1021.38 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కేంద్రం తన వాటా నిధులను విడుదల చేయగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయలేదు. దీంతో జల్‌జీవన్ మిషన్ అమలులో జాప్యం జరుగుతోంది. జల్‌జీవన్ మిషన్‌లో ఇప్పటికే ఉన్న పథకాలను విస్తరించడం, పునరుద్ధరించడంతో పాటు, పైపులైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాలి. ఆర్‌డబ్ల్యుఎస్ అధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. అయితే వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,30,653 గృహాలకు ఇప్పటి వరకు 4,47,735 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. 43.44 శాతమే గృహాలకు కుళాయిలు ఉన్నాయి. ఇంకా 5,82,918 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అనేక గ్రామాలలో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. ఇలానే పనులు సాగితే నిర్ణీత కాలంలో పనులు పూర్తయ్యే పరిస్థితి అనుమానమే.



పెదతురకపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంక్ దుస్థితి

చివరి నుంచి రెండో స్థానంలో బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 75,622 గృహాలకు కొత్తగా కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,47,914 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఇంకా 2,16,874 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కుళాయి కనెక్షన్లలో చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. రూ 205.22 కోట్లు వ్యయం అంచనాతో చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి.

15వ స్థానంలో గుంటూరు జిల్లా

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 1,24,676 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన తర్వాత 32,409 గృహాల కు కొత్తగా కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వర కు జిల్లాల్లో 1,57,085 గృహాలకు మాత్రమే కనెక్షన్లు ఉన్నాయి. ఇంకా 87,431 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కుళాయి కనెక్షన్లలో రాష్ట్రంలో 15వ స్థానంలో ఉంది. జల జీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 161 పనులు మాత్రమే పూర్తయ్యాయి.

చిట్టచివరన పల్నాడు జిల్లా

రక్షిత నీటి సరఫరాకు సంబంధించి పల్నాడు జిల్లాలో 33.03 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. గ్రామాలలో 4,32,148 గృహాలు ఉండగా పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించిన తర్వాత 84,570 కుళాయిలను ఇచ్చారు. ఇంకా 2,89,412 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. జల్‌జీవన్ మి షన్ అమలులో పల్నాడు జిల్లా చిట్టచివరన ఉంది. ఈ పథకం కింద జిల్లాలో 1055 పనులుగుర్తించి రూ.508.16 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. చేపట్టి న పనుల్లో 209 పనులు మాత్రమే పూర్త య్యాయి. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు.



కోటప్పకొండలో తాగునీటి చెరువు

నాసిరకం.. అవినీతి

గుంటూరు సిటీ: జల్‌జీవన్ మిషన్ లక్ష్యం ఇంటింటికి సురక్షితమైన తాగునీరు అందించడం.. అయితే ఆ నిధుల లేమితో పనులు అరకొరగా జరుగుతుండగా అందులోనూ అవినీతి నిండి పోయింది. పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. ఇప్పటికే జరిగిన పనులు.. అక్కడక్కడ జరుగుతున్న పనులు చూస్తే నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలకు ఏవిధంగా తిలోదకాలు ఇచ్చారో కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. జలజీవన్ మిషన్ గ్రామీణ నీటి పారుదలశాఖలోని కొందరి పాలిట వరప్రదాయిని గా మారిందన్న విమర్శలున్నాయి. జల్‌జీవన్ పనులకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ.400 కోట్ల నిధులు కేంద్రం విడుదల చేయగా అందినకాడికి దండుకో అన్న రీతిలో కొందరు పంచేసుకుంటున్నా రన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా ప్రారంభించిన 1264 పనులు లోపభూయిష్టంగా మారాయి. స్థాయిని బట్టి పర్సంటేజీ నిర్ణయించి మరీ పంపకాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గుంటూరులోని గ్రామీణ నీటి పారుదల శాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఏసీబీ దాడులే ఇందుకు నిదర్శనంగా అర్థమవుతోంది. పెదకాకానికిలో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులకు సంబంధించి రూ.42 లక్షల పనులకు కాంట్రాక్టర్ నుంచి రూ.1.68 లక్షలు లంచం తీసుకుంటూ ఏఈ శివరామకృష్ణ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఇలా పనుల మాటేమో కాని ఆ పేరుతో అధికారులు లంచాలు వసూలు చేస్తూ జల్‌జీవన్ మిషన్ నిధులను బొక్కేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నీటి పథకాలను విస్తరించి, పైపులైన్‌లు నిర్మించే పనుల్లో అధికారులు భారీగా డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు పూర్తిగా మామూళ్ల మత్తులో మునగడంతో కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు.

ముఖ్య నేత కనుసన్నల్లో పనులు..

జలజీవన్ మిషన్ పనులు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ ముఖ్య నేత కనుసన్నల్లోనే ఎక్కువగా జరుగుతు న్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ ముఖ్య అధికారి పనులన్నీ ఒక వర్గానికి చెందేలా పావులు కదిపారని సమాచారం. వారి ప్రాబల్యంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పనులు నాణ్యతపై ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.



పిడుగురాళ్లలో ఇసుక పోయకుండానే పైపులైన్ నిర్మిస్తున్న జలజీవన్ మిషన్ పనులు

దళితుల భూములపై వైసీపీ నేతల కన్ను

- ఇళ్లు ఇస్తామని చెప్పి భూమిని కాజేసేందుకు యత్నం
- సాగుదారుల సంతకాలు తీసుకున్న స్థానిక వైసీపీ నేతలు
- తాగునీటి చెరువుకని శంకుస్థాపనకు ఏర్పాట్లు.. అడ్డుకున్న రైతులు

గుంటూరు(తూర్పు), మార్చి 3: ఇళ్ల పేరుతో ఖాళీ పేపర్లపై సంతకాలు పెట్టించారు.. సాగు చేసుకునే భూమిలో మంచి నీటి చెరువును తవ్వుతామన్నారు.. శంకుస్థాపనకు ఏర్పాట్లు కూడా చేశారు. అయితే వారు మాయమాటలు చెప్తున్నారని చెరువు కోసమని చెప్పిన భూముల్లో మైనింగ్‌కు కుట్ర పన్నారని రైతులు ప్రతిఘటించారు. దీంతో వారు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ ఘటన గుంటూరు రూరల్ మండలం తోకవారిపాలెం గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని 20 దళిత కుటుంబాలు 38, 39, 40 సర్వే నెంబర్లలో ని 5.50 ఎకరాలను 80 ఏళ్ల నుంచి సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ భూమిపై స్థానిక వైసీపీ నాయకులు కన్నేశారు. ఈ క్రమంలో అక్కడి దళిత కుటుంబాలకు ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి ఖాళీ పేపర్లపై సంతకాలు తీసుకున్నారు. మంచినీటి చెరువును ఏర్పాటు చేస్తున్నామని, తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, మా భూములను స్వచ్ఛందంగా ఇస్తున్నామని చెప్పి రాసిన కాగితాలపై సంతకాలు తీసుకున్నారు. ఆదివారం చెరువుకు శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. అయితే తమ గ్రామంలో మంచినీటికి కొరత లేదని, తాము సాగు చేసుకుంటున్న భూముల్లో మైనింగ్ చేయడానికి నాయకులు కుట్ర చేస్తున్నారని రైతులు పసిగట్టారు. దీంతో ఆదివారం శంకుస్థాపనకు వచ్చిన స్థానిక నాయకులను నిలదీశారు. ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి కాగితాలపై సంతకాలు తీసుకుని భూములను స్వాధీనం చేసుకునేందుకు కుట్ర చేస్తారా అంటూ మండిపడ్డారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను లాక్కుంటే మా పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే శంకుస్థాపన నిలిపివేయాలని లేనిపక్షంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. అనంతరం అక్కడకు పోలీసులు చేరుకుని శంకుస్థాపనను నిలిపివేశారు. దీంతో ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగింది.



పెట్రోల్ బాటిళ్లతో నిరసనకు దిగిన దళితులు

కంపచెట్లు నరికి రాజధాని రైతుల నిరసన


- రెండేళ్లైనా అమలుకాని మాండమస్ తీర్పు
- ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా కొడవళ్లు, కత్తులు చేపట్టిన అమరావతి మహిళలు, రైతులు

తుళ్లూరు, మార్చి 3: అమరావతి రైతులు, మహిళలు కొడవళ్లు, కత్తులు చేతపట్టారు. రాజధాని నిర్మాణం కోసం భూములిస్తే వాటిని అభివృద్ధి చేయకపోగా అడవిగా మార్చారని, సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం ఇదే రోజు అమరావతి రైతుల ప్లాట్లను మూడు నెలల్లో అభివృద్ధి చేయాలని, ఆరు నెలల్లో అమరావతి నగర రాజధాని నిర్మాణ పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ద్విసభ్య ధర్మాసనం మాండమస్ తీర్పునిచ్చింది. అప్పటి నుంచి తీర్పును అమలు చేయకుండా కాలక్షేపం చేస్తున్న సీఎం జగన్‌రెడ్డి వెంటనే దిగిపోవాలంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ఆదివారం తుళ్లూరు రెవెన్యూలోని వారి ప్లాట్లలో ముళ్ల కంపచెట్లను తొలిగించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర రాజధానిని అడవిగా మార్చిన ముఖ్యమంత్రి డౌన్ డౌన్.. పరిపాలన చేతకాని పాలకులు కుర్చీలను వదలండి.. ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెడుతున్న జగన్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు.



ముళ్ల కంప చెట్లను తొలగిస్తున్న మహిళలు, రైతులు


మొద్దు నిద్ర నటిస్తున్నారు



మూడు రాజధానులంటూ అమరావతిని నిర్వీర్యం చేయడంతో అన్యాయం జరుగుతోందని ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాం. 2022 మార్చి 3న అమరావతి రైతుల ప్లాట్ల అభివృద్ధి, రాజధాని పనులను ఆరు నెలల్లో పూర్తిచేయమని ధర్మాసనం తీర్పునిచ్చింది. సీఎం జగన్‌రెడ్డి పట్టించుకోకుండా మొద్దు నిద్ర నటిస్తున్నాడు. తీర్పును పెండింగ్‌లో పెట్టి విశాఖ ఎలా వెళతాడు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులతో పాలన చేసేవారు అభివృద్ధిని ఎలా సాధిస్తారు. ఈసారి విజన్ ఉన్న నాయకుడిని ఎన్నుకుంటాం.

\- కాటా అప్పారావు, రైతు, తుళ్లూరు

కోర్టు ధిక్కారం శిక్షే అవుతుంది



కోర్టు ధిక్కారం శిక్షే అవుతుంది. మూడు రాజధానులొద్దు, అమరావతిని అభివృద్ధి చేయమని రైతులకు న్యాయం జరిగే విధంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును జగన్‌రెడ్డి గౌరవించాల్సిందే. లేదంటే కోర్టు ధిక్కారం కింద శిక్ష తప్పదు. అధికారం ఉందని సీఎం జగన్‌రెడ్డి ప్రస్తుతం శిక్ష నుంచి తప్పించుకోవచ్చు. కాని ఎప్పటికైనా రైతులకు చేసిన అన్యాయానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవించని వారిని ఎన్నికలలో పోటీ చేయకుండా నిరోధించాలి.

\- ఆలూరి కోటేశ్వరి, మహిళా రైతు, తుళ్లూరు



పేట్లు మోగిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న అమరావతి మహిళలు

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దింపారు

● 1538వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి3: అప్పుల ఊబిలోకి సీఎం జగన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ని నెట్టాడని, అప్పుల చేయటం కోసం ప్రభుత్వ ఆస్తులను సైతం తాకట్టు పెడుతున్నాడని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్, సేవ్ ఏపీ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1538వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ, సంపదనిచ్చే అమరావతి రాజధానిని నిర్వీర్యం చేస్తూ, ప్రభుత్వ ఆస్తులను సైతం తాకట్టు పెట్టి పరిపాలన చేయటం హేయమన్నారు. అప్పు కోసం రాష్ట్ర సచివాలయాన్ని వదలేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు అంటూ వేల కోట్లు అప్పుల చేసి, జనం నెత్తిన రుణభారం మోపాడన్నారు. రేపు ప్రజల ఆస్తులను కూడా వైసీపీ ప్రభుత్వం వదలదన్నారు. లాక్కొని మరీ తాకట్టు పెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతిని ఆరునెలల్లో అభివృద్ధి చేయమని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించి నేటికి రెండు సంవత్సరాలైనా సీఎం జగన్‌రెడ్డికి చీమ కుట్టినట్టుగా లేకపోవటంతో తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో కంచాలు మోగిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

గణపవరంలో బంగారం, నగదు చోరీ

నాదెండ్ల, మార్చి 3: మండలంలోని గణపవరం గ్రామంలో ఆదివారం పట్టపగలే ఒక ఇంట్లో చోరీ జరిగింది. ఈ చోరీలో నాలుగు సవర్ల బంగారంతో పాటు రూ 30వేల నగదును అపహరించారు. పశువుల ఆస్పత్రి సమీపంలో గల రోడ్డులో మేఘనా ఆయిల్ మిల్లులో బత్తుల శ్రీనివాసరావు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య, కుమార్తె ఇంటికి తాళం వేయకుండా పక్కింటికి వెళ్ళారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తి బీరువాలోని బంగారం, నగదును చోరీ చేశాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీ ఫుటేజ్‌ని తీసుకొని పరిశీలిస్తున్నారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

● రైతులు, రైతు సంఘాల నాయకుల ధర్నా, రాస్తారోకో

దుగ్గిరాల, మార్చి3: దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజి అగ్నిప్రమాద బాధిత రైతులకు తక్షణం న్యాయం చేయాలంటూ బాధిత రైతులు, రైతు సంఘాల నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీక్షా శిబిరం నుంచి రైతులు తెనాలి- విజయవాడ మెయిన్‌రోడ్డులోని పాతలాకుల వద్దకు చేరుకుని ధర్నా ప్రారంభించారు. తెనాలి- విజయవాడ ప్రధాన రహదారి కిరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి ప్రమాదం జరిగి 43 రోజులైనా ఇంతవరకూ బీమా సంస్థలు, యాజమాన్యంగానీ, అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడలేదని అన్నారు. రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం చొరవచూపి న్యాయం చేయకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, పసుపు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నా శివశంకర్, కోల్డ్‌స్టోరేజి ప్రమాదబాధిత రైతుల కమిటీ నాయకులు వేముల వెంకట్రామయ్య, జిల్లా తెలుగు రైతు నాయకుడు కల్లం రాజశేఖరరెడ్డి, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, జెట్టి బాలరాజు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, భాస్కరరెడ్డి, రామిరెడ్డి, వీరాంజనేయులు, కాజా వెంకటేశ్వరరావు, పోతురాజు, రమాదేవి పలువురు రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



దుగ్గిరాల పాతలాకు వద్ద తెనాలి-విజయవాడ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న కోల్డ్‌స్టోరేజి ప్రమాదబాధిత రైతులు, రైతుసంఘాల నాయకులు



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్టిక్కర్లతో పంపిణీ చేసిన కుక్కర్లు

ఓటర్లకు వైసీపీ తాయిలాలు

పెదకూరపాడు, మార్చి 3: రాబోయే ఎన్నికల నేపథ్యంలో వైసీపీ ప్రలోభాలకు తెరలేపింది. పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు, అతని కుటుంబ సభ్యులు మహిళలకు రైస్ కుక్కర్లను, వలంటీర్లు, వైసీపీకి చెందిన కొంతమంది మహిళలతో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సతీమణి వసంతలక్ష్మి డ్వాక్రా గ్రూపుల యానిమేటర్లతో, వలంటీర్లతో, గ్రామస్థాయి సిబ్బందితో బహిరంగంగా సమావేశాలు ఏర్పాటు చేసి వైసీపీ గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు. పార్టీలో అసమ్మతి రాగం వినిపిస్తున్న పలువురు ద్వితీయ శ్రేణి నాయకులను బుజ్జగించేందుకు తాయిలాలను ఎరగా వేస్తున్నారు. మరో వైపు ఎమ్మెల్యే శంకరరావు ఎన్నికల నోటిఫికేషన్ దగ్గర పడుతున్న సమయంలో పలు గ్రామాల్లో శంకుస్థాపనలకు తెర లేపారు.



పుట్లగూడం బల్లకట్టును పరిశీలిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

చెక్‌పోస్టులు, బల్లకట్టుల తనిఖీ

నరసరావుపేట, మార్చి 3: ఎన్నికల మందస్తు చర్యల్లో భాగంగా అంతరాష్ట్ర చెక్ పోస్టులను ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం, నగదు అక్రమ రవాణా నిరోధానికి పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. పులిచింతల, మాదిపాడు చెక్‌పోస్టులతో పాటు పుట్లగూడం బల్లకట్టులను తనిఖీ చేశారు. చెక్ పోస్టుల నిర్వహణ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి అక్రమ రవాణా జరగకుండా పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

రాజధాని గ్రామాల్లో పోలీసు కవాతు

అనంతవరం గ్రామంలో కవాతు చేసున్న పోలీసులు



తుళ్లూరు, మార్చి 3: మండలంలోని మూడు గ్రామాల్లో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఎన్నికల జరగనున్న నేపథ్యంలో అనతంవరం, నెక్కల్లు, వడ్డమాను, పెదపరిమి గ్రామాల్లో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్(సీఏపీఎఫ్), స్థానిక పోలీసులు కవాతు జరిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరగాలని, అన్ని రాజకీయ పార్టీలు వారు, ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ఆటంకం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తుళ్లూరు సీఐ సుభాని ఈ సందర్భంగా తెలిపారు.

స్కూల్ ప్రహరీ కూల్చివేత

● రోడ్డు కాంట్రాక్టర్ నిర్వాకం

చుండూరు, మార్చి 3: ముందస్తు అనుమతులు పొందకుండా రోడ్డు కాంట్రాక్టర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీని కూల్చివేశారు. వివరాల్లోకి వెళితే.. ఓ కాంట్రాక్టర్ చుండూరు, మోదుకూరు మధ్య రోడ్డు నిర్మాణం చేపడుతున్నాడు. ఈ క్రమంలో మోదుకూరులోని శ్రీ వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రహరీని కూల్చివేశాడు. దీనిపై పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం పేరుతో రోడ్డుకు ఇరువైపులా బారీ గోతులు తవ్వి మట్టిని తలరించుకుని వెళ్ళిన సంగతి ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. నిర్మాణ పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నా ఆర్ అండ్ బీ, ఇంజనీరింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నా అధికార పార్టీ, నియోజకవర్గ నాయకుడు అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఇంజనీరింగ్ అధికారులు పనులు పర్యవేక్షించి అనుమతులు లేకుండా కూల్చిన స్కూల్ ప్రహరీని కాంట్రాక్టర్ చేతే తిరిగి నిర్మాణం చేయించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



కూల్చి వేసిన స్కూల్ ప్రహరీ

పోలీసులు న్యాయం చేయలేదంటూ.. మహిళ ఆత్మహత్యాయత్నం



మహిళ ఇంటిపై దాడి చేయడంతో దెబ్బతిన్న సామాగ్రి, చికిత్స పొందుతున్న బాధితురాలు ప్రియాంక

కొల్లూరు, మార్చి 3: తన కేసులో పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ఓ మహిళ ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. క్రాప గ్రామానికి చెందిన గుడిపూడి కిరణ్, శిరీష దంపతులకు ఓ బాబు ఉన్నాడు. కాగా కిరణ్‌కు ప్రియాంక అనే మహిళతో వివాహేతర సంబంధం ఉంది. తన భర్త ఇంటికి రాకుండా ప్రియాంక వద్ద ఉంటున్నాడనే కారణంతో శిరీష ఆ మహిళ ఇంటికి వెళ్లి ప్రశ్నించింది. అయితే తనపై, తన తల్లిపై ఆమె దాడి చేసిందని ఆరోపిస్తూ ప్రియాంక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాడి జరిగినా తనకు పోలీసులు న్యాయం చేయలేదంటూ సదరు మహిళ ఎలుకల మందు తాగింది. గమనించి బాధితురాలి తల్లి చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం తెనాలిలోని వైద్యశాలకు తరలించారు. తన ఆత్మహత్యాయత్నానికి కారణం పోలీసులేనంటూ ఆమె ఆరోపించింది. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. ఈ విషయంపై ఎస్ఐ రవీంద్రరెడ్డిని వివరణ కోరగా వైద్యశాలలో ఆమె నుంచి వాంగ్మూలం తీసుకున్నామని, దాడి చేసిన మహిళపై కేసు నమోదు చేశామని తెలిపారు.

తపాల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): భారతీయ తపాల ఉద్యోగుల సంఘం(బీపీఈఏ) గుంటూరు డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఆదివారం అరండల్‌పేట హెడ్ పోస్టాఫీసులో సర్కిల్ అధ్యక్షుడు జి.బ్రహ్మయ్య అధ్యక్షతన అసోసియేషన్ ప్రథమ ద్వైవార్షిక సమావేశం జరిగింది. డివిజన్ అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ మురళీకృష్ణ, కోశాధికారిగా కె.బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా జి.చంద్రశేఖర్, కె.కిరణ్, ఎ.వంశీకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి వీరవసంతరావు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన తపాల ఉద్యోగులకు పెన్షన్ సాధించిన ఘనత బీపీఈఏకి దక్కుతుందన్నారు. హైకోర్టు అడ్వొకేట్ బి.జయభారతరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు న్యాయపరంగా తాను అన్ని విధాలుగా సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి.కోదండరామయ్య, తెనాలి డివిజన్ నుంచి బి.బాలకృష్ణ బి.రవికిరణ్‌కుమార్, కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



గోపిరెడ్డి (ఫైల్)

బాపట్లరూరల్, మార్చి 3: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన ఆదివారం బాపట్ల మండలం చుండూరుపల్లి గ్రామసమీపంలో చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు ప్రకారం.. బాపట్ల పట్టణం ఉప్పరపాలెంకు చెందిన శవనం గోపిరెడ్డి (30) కానిస్టేబుల్‌గా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆదివారం మధ్యాహ్నం సమయంలో ద్విచక్రవాహనంపై గుంటూరు వైపు నుంచి బాపట్లకు వస్తున్న సమయంలో ఈతేరు- చుండూరుపల్లి గ్రామాల మధ్యలోని గుంటూరు రహదారిపై ఎదురుగా వెళుతున్న లారీని ఓవర్‌టెక్ చేయటానికి ప్రయత్నం చేసే క్రమంలో లారీకి తగిలి కిందపడటంతో బాపట్ల వైపు నుంచి గుంటూరు వైపుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టటంతో గోపిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు 2018కి చెందిన బ్యాచ్ కానిస్టేబుల్. మృతుడు గోపిరెడ్డికి సంవత్సరం క్రితం వివాహం జరిగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రదేశానికి చేరుకొని కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనందబాబు, హాజరైన హైదరాబాదులో నివాసం ఉండే నియోజకవర్గ ఓటర్లు

జగన్ పాలనకు చరమగీతం పాడాలి

● హైదరాబాదులో వేమూరు నియోజకవర్గ ఓటర్లతో ఆనందబాబు

వేమూరు, మార్చి 3: రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి అరాచక పాలన సాగుతోందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి హైదరాబాదులోని మియాపూర్‌లో విశ్వనాథ్ కనెక్షన్ హాల్లో తెలుగు ప్రొఫెషనల్ వింగ్ వేమూరు నియోజకవర్గం ఆధ్వర్యంలో హైదరాబాదులో నివశిస్తున్న నియోజకవర్గ ఓటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆనందబాబు మాట్లాడుతూ జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రతి ఓటరు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని గౌరవిస్తూ చంద్రబాబునాయుడు ప్రజాహితమైన పాలన సాగించిన విషయం అందరికీ తెలుసన్నారు. జగన్ దుర్మార్గాలను అరికట్టాల్సిన అవసరం ఉందని ప్రజాజీవితం నుంచి తరిమికొట్టాలని ఇందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తాను ఓడిపోవడం ఖాయం అనే విషయం గ్రహించి జగన్ తిరిగి ఏదో ఒక విధంగా అధికారంలోకి రావాలని అనేక అడ్డదారులు తొక్కుతున్నారని అన్నారు. తాను ఓడిపోతే శాశ్వతంగా జైలు జీవితం గడపాల్సి వస్తుందన్న విషయం కూడా జగన్ గ్రహించారని పేర్కొన్నారు. ఈ తరుణంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సుదీర్ఘమైన ఆలోచనతో జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కూడా సంపూర్ణమైన మద్దతును ప్రకటించడం జరిగిందన్నారు. హైదరాబాదు పరిసర ప్రాంతాల్లో నివశిస్తున్న వేమూరు నియోజకవర్గ ఓటర్లు తమ ఓటును సద్వినియోగం చేయాలని కోరారు. వేమూరు నియోజకవర్గం నుంచి నాలుగోసారి పోటీలో ఉండటం జరుగుతుందని గతంలో రెండుసార్లు తనను గెలిపించి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఒక స్థానాన్ని కల్పించిన నియోజకవర్గ ఓటర్లకు ఎంతో రుణపడి ఉంటారని అన్నారు. నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు ఎన్నికలకు హాజరై తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. యువ ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే వివేకా హత్య

● కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 3: సొంత చెల్లెలకు న్యాయం చేయలేని జగన్ రాష్ట్రంలోని అక్కా చెల్లెళ్ళకు ఏం న్యాయం చేస్తారని? టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ పాత్రపై సమగ్ర విచారణ జరగాలన్నారు. రాజకీయ లబ్ధి కోసమే జగన్ ముఠా వివేకానందరెడ్డిని హత మార్చిందని బహిరంగ రహస్యమేనన్నారు. ఎన్నికల ముందు సీబీఐ విచారణ కోరిన వైఎస్ జగన్ ఎన్నికల అనంతరం వివేకానందరెడ్డి కుమార్తె సునీత సీబీఐ విచారణ కోరితే ఎందుకు ఆపించారని? ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అయిన తరువాత సీబీఐ విచారణ పిటిషన్‌ను జగన్ ఎందుకు వెనక్కి తీసుకున్నారని? ప్రశ్నించారు. తండ్రికి న్యాయం చేయాలంటూ సునీత పోరాడుతుంటే మరోవైపు తమ్ముడు అరెస్టు కాకుండా జగన్ కాపాడుతున్నాడన్నారు. గతంలో కర్నూలులో అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు సీబీఐ అధికారులు వస్తే ఉద్రిక్తత వాతావరణాన్ని సృష్టించింది వైసీపీ నేతలేనన్నారు. సునీత అడుగుతున్న ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. విలువల గురించి పదే పదే మాట్లాడే వైసీపీ నేతలు ఇప్పటికైనా విలువల గురించి మాట్లాడటం మానుకోవాలన్నారు.

మహా శివరాత్రికి 182 స్పెషల్ ఆర్టీసీ బస్సులు

● డీపీటీవో రవికాంత్

గుంటూరు, మార్చి 3: ఈనెల 8న జరుగనున్న మహా శివరాత్రికి శైవక్షేత్రాల కోసం ఆర్టీసీ గుంటూరు జిల్లా నుంచి 182 స్పెషల్ బస్సులను సిద్ధం చేసింది. ప్రముఖ శైవక్షేత్రాలైన కోటప్పకొండతో పాటు అమరావతి వంటి శైవక్షేత్రాలకు నిరంతరం బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.రవికాంత్ తెలిపారు. గుంటూరు 1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి శైవక్షేత్రాల కోసం ప్రత్యేక బస్సులను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గుంటూరు నుంచి అమరావతికి 17, గుంటూరు శ్రీశైలానికి 40, గోవాడకు 36, క్వారీకి 42 బస్సులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు అదనపు సర్వీసుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇక పల్నాడు జిల్లా నరసరావుపేట నుంచి కోటప్పకొండకు 265 బస్సులు, చిలకలూరిపేట నుంచి కోటప్పకొండకు 100, అలానే కోటప్పకొండ కింద నుంచి కొండపైకి భక్తుల రాకపోకల కోసం 60 మినీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలానే భక్తుల కోసం టెంట్లు, తాగునీటి సదుపాయం కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాగళం కార్యక్రమం వాయిదా

కొల్లూరు, మార్చి 3: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తలపెట్టిన నూతన కార్యక్రమం ప్రజాగళం సభలు వాయిదాపడ్డాయి. ఈ నెల 6వ తేదీన ప్రజాగళం పేరుతో చంద్రబాబు పలు నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో పాల్గొనేవిధంగా ఐదు రోజుల పాటు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రజాగళం కార్యక్రమాన్ని రాష్ట్ర పార్టీ వాయిదా వేసింది. దీంతో 7వ తేదీన కొల్లూరు మండలం దోనేపూడి వద్ద జరగాల్సిన ప్రజాగళం బహిరంగ సభ వాయిదా పడింది. తదుపరి కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది రాష్ట్ర పార్టీ సమాచారం మేరకు సభ నిర్వహణ ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఆదివారం తెలిపారు.

7న గుంటూరులో కాంగ్రెస్ బహిరంగసభ

గుంటూరు, మార్చి 3: గుంటూరు వేదికగా ఈనెల 7న కాంగ్రెస్ పార్టీ నిర్వహించే బహిరంగసభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పిలుపునిచ్చారు. గుంటూరు రాజీవ్‌గాంధీభవన్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరి రోడ్డులోని సులేమాన్‌ఖాన్ పొగాకు కంపెనీ స్థల ప్రాంగణంలో 7న మధ్యాహ్నం 3 గంటల నుంచి బహిరంగసభ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. సభకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో పాటు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఇతర ఏఐసీసీ నేతలు హాజరవుతు న్నట్లు తెలిపారు. ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి మాట్లా డుతూ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి జంగా గౌతమ్ కాంగ్రెస్‌జిల్లా, నగర అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ ఉస్మాన్, ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, ఏపీసీసీ నేతలు జగన్మోహన్‌రెడ్డి, కొరివి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేడీ శీలం, మస్తాన్‌వలి, ఈశ్వరరావు తదితరులు

మాలలకు సముచిత స్థానం కల్పించాలి

● మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు

బాపట్ల, మార్చి 3: రాజకీయపార్టీలు మాలలకు సముచిత స్థానం కల్పించాలని మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు డిమాండ్ చేశారు. బాపట్ల క్రిస్టియన్ భవన్‌లో ఆదివారం రాత్రి మాలమహాసభ, పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో మాలల సింహగర్జన సభ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన ఈ సభకు వెంకట్రావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీవర్గీకరణ తీర్పు వెల్లడించకముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వర్గీకరణ చేసేందుకు కలెక్టర్‌లకు ఆదేశాలివ్వటాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆ సర్క్యులర్‌ను రద్దుచేయాలని తీర్మానించారు. రాష్ట్రం లో 65శాతం ఉన్న మాలలకు అన్ని రాజకీయపార్టీలు రానున్న ఎన్నికలలో 20 అసెంబ్లీ, 4 పార్లమెంట్ సీట్లు కేటాయించాలన్నారు. బాపట్ల పార్లమెంట్‌లో 5లక్షలకు పైగా మాల ఓటర్లు ఉన్నందున ఆ సీటును మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణను వ్యతిరేకిస్తూ సభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. వివిధ అంశాలపై చర్చించి సభలో ఏకగ్రీవ తీర్మానాలు చేశారు.కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, జాతీయనాయకులు గోళ్ళ అరుణ్‌కుమార్, మాలమహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి కుమార్, తెలంగాణ అధ్యక్షుడు చందా లక్ష్మణ్‌బిట్టూ, మాలమహానాడు అధ్యక్షులు బేతాళ శరత్‌బాబు, మాలమహాసేన నాయకులు అలగా రవికుమార్, గోదాజాన్ పాల్, బుర్గుల వెంకటేష్, కె.కిషాన్, జి.రమేష్, డాక్టర్ పాల్, మన్నె శ్రీధరరావు, పి.రామమూర్తి, కొండ బాబు, డాక్టర్ జి. చార్వాక, నీలం నాగేంద్రరావు, దగ్గుమళ్ళ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు

కీచక ఉపాధ్యాయుడు సస్పెన్షన్

పొన్నూరుటౌన్, మార్చి3: పొన్నూరు పట్టణంలో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడుతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో పి.శైలజ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని పాతపొన్నూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ నజీర్ అహ్మద్ స్కూలులో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన్నట్లు బాలికల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో నజీర్ అహ్మద్‌ను సస్పెండు చేశారు. అదే విధంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం టి .విజయ్ కుమార్‌ను కూడా సస్పెండు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పెమ్మసాని చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీసీ నేతలు

జయహో బీసీని విజయవంతం చేయండి

● టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న 'రాష్ట్రవ్యాప్త జయహో బీసీ'కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ గుంటూరుపార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. టీడీపీ బీసీ విభాగం జిల్లా నేతలు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అండగా నిలిచిన పార్టీ టీడీపీనేనన్నారు. ఆదరణ పథకం మొదలు స్కిల్ డెవలప్‌మెంట్ వరకూ అనేక రూపాల్లో బీసీలకు టీడీపీ ప్రభుత్వం శిక్షణ ఇచ్చిందని గుర్తుచేశారు. ఒక్కఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ బీసీలను దగా చేశాడన్నారు. ఈనెల 5న బీసీ డిక్లరేషన్ ప్రకటించే జయహో బీసీ కార్యక్రమానికి బీసీలంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేముల కొండ శ్రీనివాస్ మల్లె ఈశ్వరరావు, ఉప్పుటూరి పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతరం గుంటూరు పశ్చిమ కార్యాలయంలో ఆదివారం బీసీ నేతల సమావేశమయ్యారు. నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా వున్న బైబిల్ మిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ నేతలు ఈశ్వరరావు, పేరయ్యలు పిలుపునిచ్చారు.

లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగికి నివాళి

గుంటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ సెల్ నేతలు ఆదివారం లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్థంతి కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాలయోగి దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గుడిమెట్ల దయారత్నం, నేతలు దాసరి రమణ, మద్దిరాల గంగాధర్, ప్రభాకర్, ఆనంద్, హుస్సేన్, మురళి, గణపతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహాసేన రాజేశ్‌కు భయపడ్డ జగన్‌రెడ్డి

టీడీపీ తరుపున పీ.గన్నవరం నియోజకవర్గం నుంచి బరిలోకి దిగిన మహాసేన రాజేశ్‌ను చూసి జగన్ భయపడ్డాడని టీడీపీ ఎస్సీ సెల్ నేతలు అన్నారు. ప్రభుత్వంపై చేస్తున్న పోరాటంచేస్తున్న రాజేశ్‌పై అసత్య ప్రచారాలు చేయడం దుర్మార్గమన్నారు. నిజమైన దళిత ద్రోహి జగన్‌రెడ్డి అని ఆరోపించారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

గుంటూరు, మార్చి 3: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా వచ్చే ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోలో పొందుపరచాలని జాతీయ దోబీ మహా సంఘం అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు కోరారు. దాచేపల్లిలో జరిగిన టీడీపీ బహిరంగసభకు హాజరైన మాజీ సీఎం చంద్రబాబును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రజక వృత్తిదారులకు 50 సంవత్సరాలు పెన్షన్ ఇవ్వాలి, రజక మహిళలకు రక్షణ చట్టం కావాలని, రజక చెరువులు దోబీ గాట్లపై సంపూర్ణ హక్కులు రజకులకే కల్పించాలని, ఇప్పటి వరకు రజకులకు ఉన్న అన్ని జీవోలు వంద శాతం అమలు చేయాలని కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. దీనిపై టీడీపీ అధినేత చంద్రబాబు సానుకూలంగా స్పందించారని నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు.

బాలయోగి సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), మార్చి3: తొలి దళిత లోక్‌సభ స్పీకర్ జీ ఎం సీ బాలయోగి సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మద్దు ప్రేమ్‌జ్యోతిబాబు కొనియాడారు. చార్వాక యువజన సంఘ అధ్యక్షుడు చిన్నం డేవిడ్‌విలియమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లాడ్జీ సెంటర్ అంబేద్కర్‌విగ్రహం వద్ద బాలయోగి 22వ వర్ధంతి, సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, ప్రేమ్‌రాజ్, ప్రసాదు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో వ్యాధులు నయం

● వైద్యశిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు వెల్లడి



మందులు అందజేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

గుంటూరు (మెడికల్) మార్చి 3: అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులు కొట్టక్కల్ ఆర్యవైద్యశాల మందులతో పంచకర్మ వైద్యం ద్వారా త్వరగా నయం అవుతాయని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు భాష్యం రామసేతు వెనుక గల కేరళలోని కొట్టక్కల్ ఆర్య వైద్యశాల అనుబంధ సంస్థ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులలుగా పాల్గొన్న పోలీస్ అధికారి పెనుమూడి కరుణాకర్, ఈఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఈదా సాంబిరెడ్డి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పురాతన ఆయుర్వేద వైద్యంలో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవన్నారు. పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్సలతో చక్కటి పరిష్కారం లభిస్తుందన్నారు. వైద్య శిబిరంలో 300 మంది రోగులకు ఆయుర్వేద పద్ధతిలో నాడీ పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యనిపుణులు ధనలక్ష్మీ, సాయిగౌతమ్, భానుకశ్యప్, హరిక్రిష్ణ, శ్రావణ్, ఛరిష్మా, మేనేజర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 97.46 శాతం పల్స్ పోలియో

● పోలియో చుక్కలు వేసిన మంత్రి రజిని, కలెక్టర్
● 4, 5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కల అందజేత



శ్రీనివాసరావుతోటలోని కేంద్రం వద్ద చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్

గుంటూరు (మెడికల్) మార్చి 3: ఆదివారం జిల్లాలో నిర్వహించిన పోలియో ఇమ్మ్యునైజేషన్ కార్యక్రమంలో 97.46 శాతం లక్ష్యాలను సాధించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ తెలిపారు. .జిల్లాలోలో 0-5 ఏళ్లలోపు వయస్సు కలిగిన 2,12,027 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఆదివారం రాత్రి అందిన సమాచారం మేరకు 2,06,612 మందికి పోలియో ఇమ్మ్యునైజేనషన్ నిర్వహించినటట్లు ఆమె తెలిపారు. నిర్దేశిత లక్ష్యంతో పోలిస్తే ఇది 97.46 శాతంగా ఆమె వెల్లడించారు. మార్చి 4,5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలు ఉంటే గుర్తించి వారికి పోలియో ఇమ్మ్యునైజేషన్ నిర్వహిస్తారని ఆమె ప్రకటించారు. గుంటూరు నగరంలో మార్చి 6న కూడా మాపప్ కార్యక్రమం జరుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ తెలిపారు. శ్రీనివాసరావుతోట పట్టణ ఆరోగ్య కేంద్రంలో పలువురు చిన్నారులకు ఆమె పోలియో చుక్కలు వేశారు. మంత్రితో పాటు మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, పోలియో ఇమ్మ్యునైజేషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జే.విజయలక్ష్మీ, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు తదితరులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆర్ అగ్రహారంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ తదితరులు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. వంద శాతం పోలియో ఇమ్మ్యునైజేషన్ లక్ష్యాలను సాధించాలని మంత్రి విడదల రజిని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గేదెల నారంగమణి, ఆరోగ్య శాఖ సిబ్బంది, సచివాయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కల్తీ ఆహారంతోనే అనారోగ్య సమస్యలు

● డాక్టర్ నిమ్మల శేషయ్య

గుంటూరు, మార్చి 3: కనీస ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాలు తయారు చేయటం, రోజుల పాటు నిల్వవున్న పదార్థాలను తినటంతోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ప్రముఖ వైద్యులు డాక్టర్ నిమ్మల శేషయ్య పేర్కొన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో 'అనారోగ్య సమస్యలకు అసలు మూలాలు' అనే అంశంపై ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ ఆహార పదార్థాలు కలుషితమయ్యే ముప్పు నుంచి ప్రజల్ని తప్పించటం అతి పెద్ద సవాలుగా మారుతుందని వైరస్, బ్యాక్టీరియా పారాసైట్స్ వంటివి ఆహార పానియాల్లో చేరి క్షణాల్లో లక్షల సంఖ్యలో పెరిగిపోయి జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తాయన్నారు. యువత మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, డాక్టర్ శిరీష, సాయిరామ్, అశోక్, పీఎస్ మూర్తి పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారిణీల ప్రతిభ

గుంటూరు(తూర్పు), మార్చి3: వైజాగ్, గోపాలపట్నంలో ఈ నెల 1 నుంచి ఆదివారం వరకు జరిగిన అంతర్ జిల్లాల సబ్ జూనియర్స్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారిణీలు అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు, మూడు వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. ఎమ్ అక్సా (బంగారు పతకం), పీ.కీర్తి, వీకే జీవిత, కే.లాస్యలు 3 వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ పతకాలు సాధించిన క్రీడాకారిణీలు ఈనెల 29న ఢిల్లీ నోయిడాలో జరిగే జాతీయ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారిణీలను, జట్టు మేనేజర్ పీఈటీ డీ. సరళాదేవిని అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు ప్రత్యేకంగా అభినందించారు.



భాష్యం రామకృష్ణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కఠోర శ్రమ ఎప్పటికీ వృథా కాదు

● భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య), మార్చి 3: లక్ష్యసాధన కోసం చేసిన కఠోర శ్రమ, కృషి ఏనాడు వృథా కాదని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక కొమ్మినేని గార్డెన్స్ లో భాష్యం సాయి భగవాన్ క్యాంపస్ 10వ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ ప్రయత్న లోపం లేకుండా చేసే కృషి ఉత్తమ ఫలితాలను ఇస్తుందన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా ప్రతి ఒక్క విద్యార్థి శ్రమిస్తే భవిష్యత్ జీవితం ఉత్తమంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాష్యం ఐఐటీ ప్రోగ్రామర్ ఆనంద్ కుమార్, భాష్యం మెడెక్స్ ప్రిన్సిపల్ హరిబాబు, ఎంఐఐటీ ప్రిన్సిపాల్స్ మాలతి, సుధ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

500 మందికి కంటి పరీక్షలు

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 3 : శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, రోటరి క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్, కొరిటాల ఇందిర శేషగిరిరావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో సుమారు 500మందికి వైద్యుల సమక్షంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిలో శుక్లం నిర్ధారణ అయిన పేదలకు ఉచితంగా ఆపరేషన్‌చేసి కంటిలోపల అద్దాలు (కాంటాక్ట్ లెన్స్) అమర్చే ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో శంకర నేత్రాలయ వైద్య సిబ్బందితో పాటు పీ.విష్ణువర్ధన్, కే.శేషగిరిరావు, యార్లగడ్డ చౌదరి, పావులూరి రమేష్, టీ. ధనుంజయ రెడ్డి, పీ.విమల కుమారి, వీ. సుబ్రహ్మణ్యం, మానవత, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి కృషి చేయాలి

● డాక్టర్ శనక్కాయల రాజకుమారి



చిన్నారికి పోలియో చుక్కలు అందజేస్తున్న డాక్టర్ రాజకుమారి

గుంటూరు (తూర్పు), మార్చి3: పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ శనక్కాయలరాజకుమారి అన్నారు. ఆదివారం కొత్తపేటలో జలగం రామారావు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందజేయాలన్నారు. కార్యక్రమం మూడు రోజులు పాటు కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'పది' విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా

హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడు చేసుకోవాలి

గుంటూరు(విద్య), మార్చి 3: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వారి ఆదేశాల మేరకు పదవ తరగతి విద్యార్థులకు ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షలకు హాల్‌టిక్కెట్లను ఇంటర్ నెట్ నుంచి డౌన్‌లోడు చేసుకోవచ్చునని డీఈవో పీ.శైలజ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేటి నుంచి www.bse.ap.gov.in అనే వెబ్‌సైట్ నుంచి ప్రధానోపాధ్యాయులు తమ యూజర్ ఐడీ (స్కూల్ డైస్ కోడ్), పాస్‌వర్డ్‌ను ఉపయోగించి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి తమ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేయాలని సూచించారు.

నేడు నారీ శక్తి వందన్ మారథాన్

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనత మహిళ మోర్చా జాతీయ విభాగం ఆదేశాల మేరకు జిల్లా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం నారీ శక్తి వందన్ మారథాన్(2కే వాక్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2కే వాక్ సోమవారం ఉదయం 8 గంటలకు బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియం వద్ద ప్రారంభమై లాడ్జీ సెంటర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. నగరంలోని మహిళలు ఈ మారథాన్‌లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ఆత్మీయ సమావేశంలో పెమ్మసానితో టీడీపీ, జనసేన నాయకులు

టీడీపీకి కార్యకర్తలే బలం

● ప్రత్తిపాడు నియోజక వర్గ ఆత్మీయ సమ్మేళనంలో డాక్టర్ పెమ్మసాని
● గుంటూరు ఛానల్ పొడిగింపు చంద్రబాబుతోనే సాధ్యం: బూర్ల

గుంటూరు(తూర్పు), మార్చి3: నాయకులు వస్తుంటారు పోతుంటారు.. కానీ కార్యకర్తలే శాశ్వతంగా ఉంటారని, అటువంటి కార్యకర్తలు టీడీపీకే సొంతమని, వారే టీడీపీకి బలమని టీడీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం గుంటూరు ఏటూకూరు రోడ్డులోని వీకన్వెన్షన్ సెంటరులో నియోజకవర్గ టీడీపీ-జనసేన నేతల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పెమ్మసాని మాట్లాడుతూ 45 ఏళ్లుగా రోజుకు 18 గంటలు పనిచేసే చంద్రబాబు, ప్రజల కోసం, వందలకోట్ల ఆదాయం వదిలి రోడ్లపైకి వచ్చిన పవన్‌కళ్యాణ్ వంటి నేతలు మనకు దొరకడం అదృష్టమన్నారు. బూర్ల రామాంజనేయులు వంటి అడ్మిని స్ట్రేటర్, దళితుల కష్టాలు తెలిసిన నేత అభ్యర్థిగా రావడం సంతోషకరమన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలకు, బెదిరింపులకు, వేధింపులకు గురిచేసినా టీడీపీ-జనసేన వెంటే నడుస్తున్న కార్యకర్తల మనోధైర్యాన్ని కొనియాడారు. ఒకప్పుడు ఎన్టీఆర్ ఐదు సెంట్ల భూమిని, అనంతరం చంద్రబాబు రెండున్నర సెంట్ల భూమితో పాటు టిడ్కో ఇళ్లను అందిస్తే ఈ జగన్‌రెడ్డి వాటిని పేదలకు అందకుండా చేశాడని అన్నారు. ప్రత్తిపాడు ప్రాంత ప్రజలకు కలగా మిగిలిన గుంటూరు ఛానల్ పొడిగింపు చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్ర మంలో టీడీపీ సీనియర్ నేత మాకినేని పెద రత్తయ్య, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మీ, జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసరావు, ఆ పార్టీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి నేరెళ్ల సురేష్ కుమార్, నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పెద్ద పలకలూరులో కవాతులో పాల్గొన్న సౌత్ డీఎస్పీ, నల్లపాడు సీఐ

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ కవాతు

గుంటూరు, మార్చి 3 : రానున్న సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు కేంద్ర బలగాలను రంగంలోకి దిగాయి. కేంద్ర బలగాలు శనివారానికే జిల్లాకు రాగా ఆదివారం సౌత్, నార్త్, తూళ్లూరు సబ్ డివిజన్‌ల పరిధిలో ఆయా సబ్ డివిజన్‌ల పోలీస్ అధికారుల పర్యవేక్షణలో పోలీస్ స్టేషన్ల సిబ్బంది, సీఐఎస్ఎఫ్ సిబ్బంది 100మంది రూరల్ మండల పరిధిలోని పెదపలకలూరు, చిన్నపలకలూరు, మల్లవరం, దాసరిపాలెం, పోకవారిపాలెం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. సౌత్ డీఎస్పీ మహబూబ్‌బాషా, నల్లపాడు సీఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత పోలింగ్‌కు ముందు జాగ్రత్త చర్యలు

రానున్న సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని దీనిలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను సమీక్షించాలని జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ రమణ మూర్తి ఆదేశాలు జారీచేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఆయన పోలీస్ కార్యాలయంలో జిల్లా నోడల్ అధికారులుగా ఎంపికైన పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణ విషయాలపై చర్చించారు. సమావేశంలో సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ముఠా కూలీని బలిగొన్న లారీ

గుంటూరు, మార్చి 3: ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ ముఠా కూలీ ప్రాణాన్ని బలిగొన్నది. ఆదివారం ఉదయం లాల్‌పురం నుంచి చుట్టుగుంట రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఐపీడీ కాలనీకి చెందిన మస్తాన్‌వలి (52) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్చి యార్డులో ముఠా కూలీగా పనిచేసే మస్తాన్‌వలి ఆదివారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై మిర్చి యార్డుకు వెళుతుండగా పాత మణి హోటల్ సెంటర్ వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో మస్తాన్‌వలి కింద పడిపోయాడు. లారీ టైరు మస్తాన్‌వలి పైకి ఎక్కడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఎస్ఆర్ఎంలో ముగిసిన జాతీయ స్థాయి క్రీడలు

మంగళగిరిసిటీ, మార్చి 3: మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఉద్గమ్-24 పేరిట మూడు రోజులపాటు జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ పోటీల్లో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన క్రీడా పోటీల ముగింపు సభకు ఆసియా క్రీడల రజత పతక విజేత యర్రాజి జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎస్ఆర్ఎం డైరెక్టర్లు అనిల్ నిగమ్, సిద్ధార్థ త్రిపాఠి, పంజ్ బల్వేరియా, సుస్మితా సింగ్, స్పోర్ట్స్ మేనేజరు శ్రీపతి ఆంజనేయులు పాల్గొన్నారు.

6వ విద్యా ప్రణాళికా బోర్డు సమావేశం ప్రారంభం

తుళ్లూరు , మార్చి 3: ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఐనవోలు పరిధిలోని వీఐటీ విశ్వవిద్యాలయంలో విద్యాప్రణాళిక బోర్డు 6వ సమావేశం ఆదివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు బోర్డు సమావేశం జరుగుతుంది. హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డు చైర్మెన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారె డ్డి ఈ సమావేశాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 51మంది వైస్ ఛాన్సలర్లు, డైరెక్టర్లు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీడీపీలో 4శాతం విద్యకు కేటాయిస్తుందని చంద్రారెడ్డి తెలిపారు. ముఖ్య అతిధిగా ప్రొఫెసర్ టిజీ సీతారాం(ఛైర్మెన్ ఏఐసీటీఈ) సమావేశంలో మాట్లాడుతూ వివిధ సంస్థలు కలసి పని చేసినప్పుడే వివిధ విభాగాల్లో విజ్ఞానంలో పురోగతి వేగవంతం అవుతుందన్నారు. వీఐటీ వ్యవస్థాపక ఛాన్సలర్ జీ.విశ్వనాధన్ మాట్లాడుతూ ఉన్నత విద్యా సంస్థల్లో గ్రాస్ ఎన్రోల్‌మెంట్ రేషియో పెరగాలని తెలియజేశారు. వైస్ ఛాన్సలర్ ఎస్వీ. కోటారెడ్డి మాట్లాడుతూ, ఈ సమావేశానికి ఆతిధ్యం ఇవ్వటం వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. గౌరవ అతిథి డాక్టర్ బుద్ద చంద్రశేఖర్(ఛీఫ్ కోఆర్డినేటర్ ఆఫీసర్ ఏఐసీటీఈ) మాట్లాడుతూ పరిశ్రమలు, విద్యా సంస్థలు సమన్వపరిచేలా ఏఐసీటీఈ తన సహకారాన్ని అందిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, ప్రవేటు విశ్వవిద్యాలయాలకు చెందిన వైస్ ఛాన్సలర్‌లు , రాష్ట్రంలోని కేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్లు సమావేశానికి హాజరయ్యారు.

చేనేతలకు ప్రాధాన్యమివ్వాలి

మంగళగిరి, మార్చి 3: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలూ చేనేతకు ప్రాధాన్యత ఇచ్చి జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ కోరారు. మంగళగిరి తెనాలి రోడ్డులోని మార్కండేయ పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఫెడరేషన్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు చేనేత వృత్తి పరిరక్షణను గాలికొదిలేసి చేనేత పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారన్నారు. చేనేతలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటూ అన్ని రంగాల్లోనూ మొండిచెయ్యి చూపిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో చేనేతలకు ప్రాధాన్యమిచ్చిన వారికే తమ మద్దతు వుంటుందన్నారు. సమావేశంలో శివరామ్‌ప్రసాద్, సమతం రమణ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మంగళగిరి బాడ్మింటన్ లీగ్ పోటీలు



ప్రథమ స్థానం సాధించిన జట్టుకు బహుమతి అందజేస్తున్న కిరణ్‌చంద్

తాడేపల్లి, మార్చి 3: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకరంతో తాడేపల్లి మండలం పెనుమాకలో జరుగుతున్న మంగళగిరి నియోజకవర్గస్థాయి మంగళగిరి బాడ్మింటన్ లీగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 185 జట్లు పోటీపడ్డాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభలో టీడీపీ నేతలు పలువురు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యం చేసిందన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్న ఉద్దేశ్యంతో నారా లోకేశ్ వివిధ రకాల టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించడమే నారా లోకేశ్ లక్ష్యమన్నారు. మంగళగిరిలో సాక్షాత్తూ జగన్ పోటీ చేసినా ఓటమి తథ్యమన్నారు. నారా లోకేశ్ లక్ష ఓట్ల మెజారిటితో విజయం సాధిస్తారన్నారు.

విజేతగా నిలిచిన ఛాలెంజర్స్ జట్టు..

బాడ్మింటన్ పోటీల్లో విజేతగా చాలెంజర్స్ (పూజిత్‌రెడ్డి-పవన్‌కళ్యాణ్) జట్టు నిలిచి ప్రథమస్థానంతోపాటు రూ.లక్ష కైవసం చేసుకుంది. రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్ సహకారంతో నగదు అందజేశారు. ద్వితీయ స్థానాన్ని కొల్లి శేషయూత్ జట్టు రూ.75 వేలు, తృతీయ స్థానాన్ని ప్రో షటిల్ జట్టు రూ.50వేలు, నాలుగవ స్థానాన్ని కేకే యూత్ జట్టు రూ.25 వేలు గెలుపొందాయి. కార్యక్రమంలో మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, జంగాల వెంకటేష్, నియోజకవర్గ అధ్యక్షులు పడవల మహేష్, రెంటపల్లి రాజేష్, కొల్లి శేషు, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, వల్లభనేని వెంకట్రావు, మంచికలపూడి వైష్ణవి, బొర్రా కృష్ణవందన, షైనర్‌బాబు, వెంకట్, ఎం సత్యనారాయణ, పఠాన్ జానీఖాన్ పాల్గొన్నారు.

రాష్ట్ర సచివాలయం తాకట్టు దుర్మార్గం

తాడేపల్లి, మార్చి 3: జగన్ రాష్ట్రాన్ని దివాలా తీయించాడని ఆఖరికి రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టారని, ఇంతకంటే సిగ్గుచేటు పని ఉండదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ జగన్ మళ్లీ గెలిస్తే ప్రజల ఆస్తులు తాకట్టు పెడతారని రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రమేష్ అన్నారు. తాడేపల్లిగూడెం, గురజాల టీడీపీ జనసేన సభలను చూచి వైసీపీ నాయకులకు చలి జ్వరం వచ్చిందన్నారు. ప్రశాంత్ కిషోర్ వంటి వారు కూడా జగన్ ఓటమి తథ్యమని వ్యాఖ్యానించారన్నారు. సంపదను సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సత్తా ఒక్క చంద్రబాబుకి మాత్రమే ఉందని రమేష్ తెలిపారు.

3729 మంది చిన్నారులకు పోలియోచుక్కలు

దుగ్గిరాల, మార్చి 3: మండలంలోని 3729 మందికి ఆదివారం పోలియో చుక్కలు వేశారు. మండలంలో 27 కేంద్రాలను ఏర్పాటు చేయగా దుగ్గిరాల పిహెచ్‌సీ పరిధిలో 15 కేంద్రాల్లో 2296 మందికి, ఈమని పీహెచ్‌సీ పరిధిలో 12 కేంద్రాల్లో 1433 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. స్థానిక వీబీఎం ప్రాథమిక పాఠశాలలో జడ్పీటీసీ మేకతోటి అరుణకుమారి, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణిలు చిన్నారులకు పోలియోచుక్కలను వేసి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు మహ్మద్ అబ్దుల్‌రహమాన్, శ్రీవల్లి, ఇందిర, సుకన్య, వంకదార సుబ్బారావు, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

ఫిరంగిపురం, మార్చి 3 : ఫిరంగిపురంలో ఆదివారం వైసీపీ నేత పోలిశెట్టి రాజారావు, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ బందనాథం లూరు రాజు, పొనుగుపాడు గ్రామానికి చెందిన మేళం ఇన్నయ్య, మేళం ఏసుపాదం, జక్కుల కృష్ణ, మేళం చిన్నోడు వైసీపీ నుంచి తాడికొండ నియోజక వర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరి వారికి తెలుగుదేశం కండువాలను కప్పి శ్రావణ్ కుమార్ స్వాగతించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి కోటేశ్వరరావు, మండల నరసింహారావు, రాఘవరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం భేష్..

ఫిరంగిపురం, మార్చి 3 : ప్రకృతి వ్యవసాయం బాగా చేస్తున్నారని, అమెరికా దేశానికి చెందిన ఎకో శేషన్ వ్యవస్థాపకులు మర్ఫి జరోఫ్ అభినందించారు. ఆదివారం మండలంలోనివేములూరిపాడు గ్రామంలో ఇర్ల వెంకటేశ్వర్లు పొలంలో వేసిన పంటలైన మొక్క జొన్న, స్వీట్‌కార్న్, బెండ, టమాటా, మిరప, వంగ, గోరు చిక్కుడు, స్కంద, ఆముదం, మునగ, జొన్న, సజ్జ, మినుములు, పచ్చ పెసలు, ఉల్లి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, ఆకు కూరలు వంటి అంతర్ పంటల సాగు విధానాన్ని చూసి వారు ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే రాజకుమారి, ప్రభాకర్, వెంకటరావు, స్మిత, హర్ష, సత్యనారాయణ, ఉమాదేవి, వీరలక్ష్మి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సాయుధ బలగాల కవాతు

మంగళగిరి సిటీ, మార్చి 3: ఎంటీఎంసీ పరిధిలోని నవులూరు గ్రామంలో ఆదివారం సాయుధ పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ రవికాంత్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా దళాల పహారా పెంచామని, ఇప్పటికే కాజ, కృష్ణాయపాలెం వద్ద ప్రత్యేక పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుచర్యలు చేపట్టామన్నారు. కవాతులో రూరల్ సీఐ వెంకట్రావు, ఎస్ఐ క్రాంతికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

మంగళగిరి సిటీ, మార్చి 3: గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలోని ఫిట్‌జోన్ జిమ్ సెంటరులో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ కేటగిరీల్లో వివిధ విభాగాలకు సంబంధించి ఈ పోటీలు జరిగాయి. జిల్లా నుంచి 50 మంది పవర్ లిఫ్టర్లు హాజరయ్యారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా నేతలు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందాని, గుమ్మడి వెంకటేశ్వరరావు, పీ.భాస్కరరావు, బి.చంద్రిక, ఘట్టమనేని సాయిరేవతి, మస్తాన్‌వలి, ఆళ్ల పవన్‌కుమార్ పోటీలను పర్యవేక్షించారు.

తాడేపల్లి ఎస్ఐగా ప్రతాప్‌కుమార్

తాడేపల్లి టౌన్, మార్చి 3: తాడేపల్లి ఎస్ఐగా ప్రతాప్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. దుగ్గిరాల పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై తాడేపల్లి వచ్చారు.ఎస్ఐ ప్రతాప్‌కుమార్ గతంలో తాడేపల్లి ఎస్‌హెచ్‌వోగా పనిచేశారు.

టీడీపీ ఫ్లెక్సీలు చింపిన వైసీపీ మూక

ప్రత్తిపాడు, మార్చి 3: మండల పరిధిలోని తుమ్మలపాలెంలో శనివారం రాత్రి వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ప్రచారం జరిగింది. కార్యక్రమం జరుగుతుండగానే గ్రామంలో ఏర్పాటుచేసిన టీడీపీకి చెందిన ఫ్లెక్సీను వైసీపీ కార్యకర్తలు చింపి వేశారు. దీనిపై టీడీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దోచుకోవడానికే మూడు రాజధానులు

తాడికొండ, మార్చి 3: మూడు రాజధానులు రాష్ట్రాభివృద్ధి కోసం కాదని రాష్ట్రాన్ని దోచుకోవటం కోసమేనని రైతులు, మహిళలు ఆరోపించారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజధాని అమరావతిని కేంద్రంగా చేసుకొని అభివృద్ధి వికేంద్రీకరణ చేయాల్సింది పోయి, అధికార వికేంద్రీకరణ చేస్తాను అంటూ అంతా సర్వనాశనం చేశారన్నారు. ఉన్నత న్యాయస్థానం తీర్పును గౌరవించకుండా నియంతపోకడలతో పాలకులుండటం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధి పనులను కొనసాగించాలని సూచించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



సమావేశంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

● తాడిబోయిన హరిప్రసాద్

తెనాలి రూరల్, మార్చి 3: బీసీల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీ చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 5న జయహో బీసీ పేరుతో మంగళగిరి దగ్గరలో టీడీపీ, జనసేన నిర్వహిస్తున్న బీసీ డిక్లరేషన్ సభకు బీసీలందరం తరలివచ్చి మన హక్కులను కాపాడుకునేలా మద్దతు తెలుపుదామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత బీసీలకు రక్షణలేకుండా పోయిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు తగిన గౌరవమిచ్చే ఉమ్మడి కూటమిని గెలిపించుకుందామన్నారు. ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విడుదల చేసిన ఎన్నికల మినీమేనిఫెస్టోలో బీసీలకు రక్షణ చట్టాన్ని కూడా చేర్చారని ఆ నాయకత్వాన్ని బలపరుస్తూ బీసీలందరం మంగళగిరి సభకు తరలివెళ్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్నం పిన్నారావు, జొన్నాదుల మహేష్, పరుచూరి రమ్య, ఫణిదపు దుర్గ, బ్రహ్మేశ్వరరావు, కావేటి విజయ్, చల్లగాలి శంకర్, కృష్ణవేని, మల్లవరపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న సుబ్రహ్మణ్యం

సరస్వతీ శిశుమందిర్ వార్షికోత్సవం

తెనాలి అర్బన్, మార్చి 3: సుల్తానాబాద్‌లోని కుమార్ కాలనీలో సరస్వతీ శిశు మందిర్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుమార్ సంస్థల ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులను తీర్చిదిద్దేందుకు శిశు మందిర్ కృషి చేస్తుందన్నారు. మానవతా విలువలు, ఉపాధి అవకాశాలు ఉండేలా విద్యాబోధన చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఎంఈవో ఎం.లక్ష్మీనారాయణ, డాక్టర్ రాధాబాయి, సామల లక్ష్మణబాబు, యర్రంశెట్టి హనుమంతరావు, కోడూరి రమాదేవి ప్రసంగించారు.

విద్యార్థులు శాస్త్ర పరిశోధనల్లో ముందుండాలి

● డాక్టర్ నన్నపనేని ప్రతాప్

తెనాలి అర్బన్, మార్చి 3: ఇంజనీరింగ్, మెడిసిన్ రంగాలే కాకుండా విద్యార్థులు శాస్త్ర పరిశోధన రంగాల్లో కూడా ముందుకు రావాలని డాక్టర్ నన్నపనేని ప్రతాప్ పేర్కొన్నారు. ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికి శాస్త్రవేత్తల అవసరం ఎంతగానో ఉందని, ఇందుకోసం విద్యార్థులు ఆ రంగాన్ని కూడా ఎంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిశోధనలు చేసే విద్యార్థులకు ఉన్నత విద్యకు ఉపకార వేతనాలు అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. 180 ప్రాజెక్టులలో 8 ప్రాజెక్టులను మూడు విభాగాల్లో ఎంపికచేసి బహుమతులు అందజేశారు. కుమార్ పంప్స్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ జయరామకృష్ణ, డాక్టర్ భువన చంద్ర, హరికృష్ణ, సూర్య, కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, సీఈవో భాస్కర్, ప్రిన్సిపల్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రదర్శన ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రతాప్

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తెనాలి రూరల్, మార్చి 3: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని నేలపాడుకు చెందిన కనపర్తి శోభన్‌బాబు (28) గత 6నెలలుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ గత నెల 29న గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కనపర్తి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు దరాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.



వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నాజరుపేటలో 200 మందికి కంటి వైద్య పరీక్షలు

తెనాలి, మారీసుపేట మార్చి 3: స్థానిక నాజరుపేట సత్యసాయినగర్‌లో శ్రీసత్యసాయి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం శ్రీసత్య సాయి సేవా సమితి, శంకర కంటి ఆసుపత్రి, పెదకాకాని వారి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలను నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శుక్లం ఆపరేషన్లకు 40 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో కోవెలమూడి నారాయణరావు, టి.తిలక్, ప్రసాదరావు, బి.రామకృష్ణ, వి.సుబ్బారావు, బి.వెంకట్రావు, సాయిరాం, టి.మోహనప్రియ, హేమలత, అన్నపూర్ణ, మీనాకుమారి, జ్యోతి, ప్రమీల, సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీ కాంస్య విగ్రహం

తెనాలి అర్బన్, మార్చి 3: దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావు కాంస్య విగ్రహాన్ని తెనాలి శిల్పులు రూపొందించారు. సూర్య శిల్పశాలలో 500 కిలోల కంచుతో రెండు నెలల పాటు శ్రమించి విగ్రహాన్ని తయారు చేశామని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్ష తెలిపారు. భారత రత్న ప్రకటించిన తరువాత ఆయన అభిమానులు ప్రతి పట్టణంలో విగ్రహ నిర్మాణాలకు పూనుకున్నారని విజయవాడ, గుంటూరు, నెల్లూరు పట్టణాల నుంచి ఆర్డర్లు లభించాయన్నారు.



పీవీ కాంస్య విగ్రహంతో శిల్పులు

కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లు

తెనాలి, మారీసుపేట మార్చి 3: పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు, క్యాంటీన్ నిర్వాహక సభ్యుడు క్రొత్త రమేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా పార్లమెంటరీ స్థాయి నాయకుడు డాకర్ పెమ్మసాని చంద్రశేఖర్ సౌజన్యంతో స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో, శివాజిచౌక్‌లో అన్నక్యాంటీన్‌లలో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, మాదల కోటేశ్వరరావు, ముళ్ళపూడి వెంకట్, వెల్లంకి సాంబయ్య, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పల్స్ పోలియో విజయవంతం

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట మార్చి 3: పట్టణంలో ఈరోజు జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని పట్టణ మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న తెలిపారు. పట్టణంలో ఆదివారం మొత్తం 12,723 మంది పిల్లలకు గాను 12,214 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకున్నారని మున్సిపల్ కమిషనర్ శేషన్న తెలిపారు. ఈరోజు జరిగిన పల్స్ పోలియోలో 96శాతం జరిగినదని మిగిలిన పిల్లలకు సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సిబ్బందితో పాటు నాలుగు మొబైల్ టీమ్స్ తిరుగతాయని, రైల్వే స్టేషన్‌లోను, బస్టాండ్‌లోను కూడా ఆ రెండు రోజులు పోలియో సెంటర్లు ఉంటాయని తెలిపారు.



చిన్నారికి పోలియోచుక్కలు వేస్తున్న డాక్టర్ హనీఫ్

● **తెనాలి రూరల్:** పోలియోరహిత సమాజ నిర్మాణానికి అందరం కలిసికట్టుగా పాటుబడదామని సంగంజాగర్లమూడి పీహెచ్‌సీ వైద్యుడు హనీఫ్ అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం జాగర్లమూడి పీహెచ్‌సీ పరిధిలోని చిన్నారులకు డాక్టర్ హనీఫ్ సిబ్బందితో కలిసి పల్స్ పోలియో చుక్కల మందును వేశారు. తల్లిదండ్రులకు పల్స్ పోలియో చుక్కలు అందించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. పరిసర ప్రాంతాల్లో చుక్కలు వేయించని చిన్నారులంటే వారందరికి పోలియో చుక్కలపై అవగాహన కల్పించి పీహెచ్‌సీ సెంటర్, లేదా అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదించినా చుక్కలు అందించడం జరుగుతుందని హనీఫ్ తెలిపారు. చిన్నారులకు అంగవైకల్యం బారినపడకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **తెనాలి, మారీసుపేట:** చిన్నారులకు రెండు చుక్కలు వేద్దాం పోలియోపై విజయం సాధిద్దాం అని పట్టణ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా పట్టణ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలను వేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తప్పనిసరిగా ఐదు సంవత్సరాల లోపు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ పోలియో చుక్కలు వేయడం వలన చిన్నారులకు పోలియో సంబంధిత వ్యాధులను అరికట్టవచ్చన్నారు. తప్పనిసరిగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ కారుమూరు హెలెన్ నిర్మల, డాక్టర్ బీబీజాన్, ఆరోగ్య విస్తరణాధికారి అంది బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్ చింతల ప్రసన్న, పుష్పలత, ఏఎన్ఎం జె.లక్ష్మితులసి, ఆరోగ్య సిబ్బంది, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 3: పోలియోరహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయూం అహ్మద్ అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం పొన్నూరు, చేబ్రోలు మండలాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కల మందువేశారు. పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో కమిషనర్ పల్స్ పోలియో చుక్కల మందు శిబిరాన్ని కమిషనర్ ప్రారంభించారు. బస్టాండ్ సెంటర్, రైల్వేస్టేషన్, ఆరోగ్య కేంద్రాలు, సచివాలయల వద్ద మండల పరిధిలోని గ్రామాలో పంచాయతీ కార్యాలయాల వద్ద పోలియో చుక్కల మందు వేశారు. చేబ్రోలులో మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలిగడ్డ సాహితి పోలియో చుక్కల మందు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో చుక్కలపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి

● ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర, మార్చి 3: పోలియో చుక్కలు వేయించటంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపరలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎంపీపీ పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, ఎస్ఐ రవీంద్రరెడ్డి, వైద్యసిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పద్మావతి మాట్లాడుతూ అంగవైకల్యాన్ని నిర్మూలించాలంటే పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది కూడా పిల్లలకు పోలియో చుక్కలు వేయించటంలో ఒక బాధ్యతగా తీసుకోవాలన్నారు. మండల వైద్యాధికారి లక్ష్మీసుధ మాట్లాడుతూ మండలంలో 2వేల 832మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా అందులో 2వేల 747 మందికి వేయడం జరిగిందన్నారు. మిగిలిన చిన్నారులకు 4,5 తేదీల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రియాంక, ఏఎన్ఎంలు, ఆషా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ పద్మావతి, వైద్యాధికారులు

నాదెండ్ల గెలుపు.. తెనాలి అభివృద్ధికి మలుపు

● వీరవల్లి మురళి, నాగభూషణం

తెనాలి, రూరల్ మార్చి 3: నాదెండ్ల మనోహర్ గెలుపు తెనాలి ప్రాంత అభివృద్ధికి మలుపు కాగలదని రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, అంగలకుదు గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అన్నారు. అంగలకుదురు గణేష్ యూత్ వీరవల్లిమురళి, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణంల ఆధ్వర్యంలో ఆదివారం ఆ గ్రామం నుంచి తెనాలి జనసేన కార్యాలయం వరకూ పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లి మనోహర్‌ను కలిసి ఆయనను గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ పొత్తుల్లో భాగంగా తెనాలిలో ఇరుపార్టీల అభ్యర్థిగా నాదెండ్ల మనోహర్ పోటీచేస్తున్నారని అధినాయకుడి ఆదేశాల మేరకు ఆయన గెలుపునకు అహర్నిశలు కృషి చేస్తామన్నారు. గతంలో స్పీకర్‌గా పనిచేసే సమయంలో తెనాలి ప్రాంతంలో నెలకొని ఉన్న అనేక సమస్యలపై మనోహర్ దృష్టిపెట్టి పరిష్కరించి ప్రజల మనన్నలు పొందారన్నారు. తిరిగి ఆయనను అధికారంలోకి తీసుకువస్తే తెనాలి ప్రాంతం వర్తక, వాణిజ్య వ్యాపార, విద్య, వైద్యం ఇలా అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్ది ఈ ప్రాంతానికి మరింత గౌవరం తెస్తారన్నారు. తొలుత మనోహర్‌కు గజమాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కనగాల పిచ్చయ్య, నలకుర్తి విజయ, బడుగు రామమూర్తి, కనగాల సాంబశివరావు, చెన్నుపాటి తేజస్వి, సూర్యదేవర బోస్, చెన్నుపాటి రవీంద్ర, ఆలపాటి వెంకటరామయ్య, వెలగా ఆదినారాయణ, ఆలపర్తి పార్వతి, నలుకుర్తి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన అంగలకుదురు యువత

అంగలకుదురుకు చెందిన పలువురు యువత జనసేన పార్టీలో చేరారు. ఆదివారం తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మనోహర్‌ను కలిసిన యువతను జనసేన పీఏసీ ఛైర్మన్, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. యువత బంగారు భవిష్యత్తుకు తెలుగుదేశం, జనసేన ఉమ్మడి పాలన రాష్ట్రానికి అవసరమని ఆయన స్పష్టం చేశారు. పలువురు పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.



మనోహర్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘాల నాయకులు

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి అండగా నిలుస్తా: మనోహర్

తెనాలి రూరల్, మార్చి 3: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి తాను అండగా నిలుస్తానని రానున్న ఎన్నికల్లో తనను అధికారంలోకి తీసుకువచ్చె బాధ్యత మీపైనే ఉందని టీడీపీ, జనసేన ఉమ్మడి తెనాలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బస్టాండ్ రోడ్ సమీపంలోని వైశ్య విద్యానిధి భవనంలో ఆర్యవైశ్యుల సంఘీయులతో మనోహర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పలు అంశాలను చర్చించుకున్నారు. తొలుత మనోహర్‌ను ఆర్యవైశ్యుల సంఘీయులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఆర్యవైశ్యుల సంఘపెద్దలు పాల్గొన్నారు.

రెయిన్‌ట్రీ పార్క్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉషా కిరణ్ ప్యానెల్ గెలుపు

పెదకాకాని, మార్చి 3: పెదకాకాని మండల పరిధిలోని రెయిన్ ట్రీ పార్క్ ద్వారకా కృష్ణ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ప్రధానంగా రెండు ప్యానెల్స్ పోటీపడ్డాయి. అందులో ఉషా కిరణ్, రామ సుశీల ప్యానల్స్ పోటీ చేయగా.. ఉషా కిరణ్ ప్యానల్ గెలుపొందినట్లు తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

తెనాలి రూరల్, మార్చి 3: భర్త వేధింపులకు గురిచేస్తున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన స్వప్నకు నూతక్కి గ్రామానికి చెందిన పెదపూడి సుధీర్‌తో గత 3సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గత కొంత కాలం నుంచి భర్త తనను మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పూర్ణ ప్రజ్ఞాచారి సీస పద్యాలకు సాహితీ సంస్థ ప్రశంస

తెనాలి రూరల్, మార్చి 3: వేదనిధి వేమన అనే శీర్షికతో పూర్ణ ప్రజ్ఞాచారి రాసిన సీస పద్యాలకు శ్రీవాల్మీకి సోమన పోతన వేమన సాహితీ సంస్థ నుంచి ప్రశంసలు లభించాయి. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా నంగునూరులో గత కొంత కాలం నుంచి వాల్మీకి సోమన పోతన వేమన జీవిత సాహిత్యం కవితశైలి తదితర అంశాల గూర్చి తెలంగాణ, ఆంధ్ర రచయితల కవుల నుంచి పద్యగద్య కవిత శీర్షికలను సంకలనానికి పంపించాలని ఆహ్వానం అందినట్లు కొలకలూరు గ్రామానికి చెందిన నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి తెలిపారు. వారి ఆహ్వానం మేరకు తాను పంపిన రెండు సీస పద్యాలు వేమన వ్యక్తిత్వ, సాహిత్యాలను ప్రతిబింబించేలా ఉన్నాయని, యోగివేమన పేరిట తీసుకువస్తున్న కావ్య సంకలనంలో తాను రాసిన పద్యాలు ప్రచురించేందుకు న్యాయ నిర్ణేతల కమిటీ సమ్మతించినదని సాహితి సంస్థ సమన్వయకర్త వేముల చరణ్ తెలుపుతూ అభినందించారని ప్రజ్ఞాచారి తెలిపారు.



పూర్ణప్రజ్ఞాచారి

మేముసైతం సేవలు అభినందనీయం

● సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్

తెనాలి రూరల్, మార్చి 3: నందివెలుగు గ్రామానికి చెందిన మేము సైతం సేవా సంస్థ సమాజసేవకు అందిస్తున్న సేవలు అభినందనీయమని గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని నందివెలుగు జంక్షన్‌లో మేముసైతం ఆధ్వర్యంలో తాగునీటి చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. దాని ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పవన్‌కుమార్, రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు, మేము సైతం గౌరవ అధ్యక్షుడు ధూళిపాళ్ల సుధాకర్, జనసేన నాయకుడు ఎద్దు శివమణిలు ముఖ్య అతిథులుగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. మేము సైతం అందిస్తున్న సేవలను కొనియాడి వారిని అభినందించారు. కార్యక్రమంలో జగన్ మోహన్‌రావు, షేక్ షకూర్ భాష, కల్యాణం కృష్ణసాగర్, సోమరాజు, వెంకటనరసయ్య, కల్యాణం నరసింహారావు, నూనె రవిచంద్ర, యర్రమోతు సత్యనారాయణ, యక్కటి రమేష్, కల్యాణం కళ్యాణ్‌కుమార్, నవనీతం శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని మండలంలో కేంద్ర బలగాల కవాతు

పెదకాకాని, మార్చి 3: కేంద్ర బలగాలతో పెదకాకాని మండలంలో ఆదివారం కవాతు నిర్వహించినట్లు పెదకాకాని సీఐ కే వీరస్వామి తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం నార్త్ డీఎస్పీ పర్యవేక్షణలో పెదకాకాని సీఐ వీరస్వామి నేతృత్వంలో పెదకాకాని పోలీస్ స్టేషన్ సిబ్బంది, కేంద్ర బలగాలైన సీఐఎస్ఎఫ్ సిబ్బంది సుమారు 30మందితో మండల పరిధిలోని పెదకాకాని, ఉప్పలపాడు, తక్కెళ్ళపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. రాబోయే ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని శాంతిభద్రతలు పరిరక్షించడం కోసం గ్రామాలలో కవాతు నిర్వహించడం జరిగిందని సీఐ పేర్కొన్నారు.

దళితులు సంఘటితమై రాజ్యాధికారం సాధించాలి

● దర్శకుడు దిలీప్‌రాజా

తెనాలి అర్బన్, మార్చి 3: అసెంబ్లీ ఎన్నికల్లో దళితులు సంఘటితమై రాజ్యాధికారం సాధించాలని, పాత గుంటూరు జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసి సత్తా చూపాలని దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. వైసీపీ, టీడీపీలు దళితులను ముఖ్యమంత్రి చేస్తాయా అని ఆదివారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. ఆ పార్టీలు ఇందుకోసం మ్యానిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణాల ఆధిపత్యం ఎంతకాలం భరిస్తారని, దళితులంతా ఏకమై పోటీచేసే వారిని ప్రోత్సహించి తమ అధిపత్యాన్ని చూపాలన్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల పార్లమెంట్ స్థానాల్లో కూడా అర్హులైన వారిని ఎంపికచేసి బరిలోకి దింపుతామన్నారు.

బైబిల్ పోటీలు

తెనాలి అర్బన్, మార్చి 3: ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చిలో ఉపవాస కూడికలు నిర్వహించారు. బైబిల్ పోటీలు నిర్వహించి బ్రదర్ ఆనందన్న బహుమతులు అందజేశారు. రత్నకుమారి, ప్రశాంత్, సీమోను పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఇంటర్ విద్యార్థినికి రూ.50వేలు ఆర్థికసాయం

తెనాలి అర్బన్, మార్చి 3: మానవతా స్వచ్ఛంద సంస్థ సమావేశం ఆదివారం ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. రూరల్ మండల పెదరావూరుకు చెందిన ఎం.వైష్ణనాగశ్రీ అనే విద్యార్థినికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇంటర్ చదువుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న హనుమంతరావు కుటుంబానికి సాయం అందించడంపై ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులు డాక్టర్ పద్మావతి, ఎం.అర్జున, పి.శ్రీనివాస్, ఎస్.కృష్ణమూర్తి, నారాయణ, జయశేఖరరాజులను ఘనంగా సన్మానించారు. కొత్త సుబ్రహ్మణ్యం, కళ్యాణి, శ్రీనివాసబాబు, ఓంకార్ ప్రసాద్, శర్మ, సత్యనారాయణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



నరేంద్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

టీడీపీలోకి వైసీపీ కుటుంబాలు

పెదకాకాని, మార్చ్ 3: పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు, నంబూరు గ్రామాలకు చెందిన 150మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సమక్షంలో ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేసి భారీ మెజార్టీతో గెలిచేలా తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి తాళ్ళ శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొల్లెద్దు సుశీలరావు, తక్కెళ్లపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలపాటి సంపత్, మాచవరపు మల్లికార్జునరావు, మోపర్తి సంజీవ్, నందిపాటి ప్రసాద్, భైరపనేని లక్ష్మీనారాయణ, కూచిపూడి రాజేష్, అయినంపూడి లింగయ్య, కనకమళ్ళ సురేష్, అలపర్తి ధర్మేంద్ర, మొండితోక నరేష్, నంబూరు టీడీపీ నాయకులు కోసం బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైనిక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తా

● ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, మార్చి 3: మాజీ సైనిక ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి సహకారం అందిస్తామని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐటి కంపాడు రోడ్డులో ది పొన్నూరు ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ సొసైటీలో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భగా సమావేశానికి విచ్చేసిన నరేంద్ర కుమార్‌ను మాజీ సైనికోద్యోగులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సైనిక ఉద్యోగులు దేశం కోసం చేస్తున్న త్యాగాలు మరువలేనివి అన్నారు. ఒక్క పొన్నూరు పట్టణంలోనే మాజీ సైనిక ఉద్యోగులు 500 మంది ఉన్నారన్నారు. సైనిక ఉద్యోగులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామన్నారు.



మాజీ సైనిక ఉద్యోగులతో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

డీవీసీ హాస్పటల్ ద్వారా కార్పొరేట్ వైద్యం

చేబ్రోలు, మార్చి 3: గ్రామీణ ప్రాంత ప్రజలకు డీవీసీ హాస్పటల్ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నదని హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని శేకూరులో డీవీసీ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శేకూరు పరిసర ప్రాంతాలకు చెందిన 280మంది వైద్య శిబిరానికి హాజరై వివిధ రకాల వైద్య సేవలు పొందారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ డీవీసీ హాస్పటల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హాస్పటల్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరం ఏర్పాటుచేసి మందులు అందచేసిన ఛైర్మన్ నరేంద్రకుమార్ ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయికి కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో హాస్పటల్ చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ కరణం, జనరల్ సర్జన్, డాక్టర్ ఆషీస్, ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ జిష్ను, గైనకాలజిస్ట్ డాక్టర్ శృతి తదితరులు పాల్గొన్నారు.



శేకూరు గ్రామంలో మెడికల్ క్యాంప్ ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాస్



మహిళలను సత్కరిస్తున్న రోయిన్‌బో, రోటరీ సభ్యులు

మహిళలు అగ్రగాములుగా నిలవాలి

డాక్టర్ జీవనలత

తెనాలి రూరల్, మార్చి 3: సమాజంలో పురుషులతో పాటు మహిళలకు తగిన గౌరవం పొందేలా మహిళలు అన్ని రంగాల్లో అగ్రగాములుగా నిలవాలని రెయిన్‌బో ట్రస్ట్ నిర్వాహకురాలు డాక్టర్ జీవనలత అన్నారు. రానున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి రోటరీక్లబ్, రెయిబో ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తపేట ఎస్వీవీఎస్ కల్యాణ మండపంలో ఆరోగ్యకరమైన ఆహారంపై మహిళలకు వంటల పోటీలు నిర్వహించడంతోపాటు, పలురంగాల్లో అగ్రగాములుగా సేవలందిస్తున్న 10మంది మహిళలను ఘనంగా సత్కరించి అవార్డులు ప్రదానం చేశారు. వైద్య రంగంలో సేవలందిస్తున్న బాపట్ల జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ డి.విజయమ్మ, విద్యలో రిటైర్డ్ టీచర్ ఉప్పాల రజనీదేవి, కూచిపూడి నృత్యప్రదర్శనలో పెసర్లంక వసంత దుర్గ, డోలు వాయిద్యంలో షేక్ లలితమనీషా, పవర్ లిఫ్టింగ్ చాంపియన్ నాగం జ్ఞాన విద్య, ఆధ్యాత్మికంలో మాజేటి శారదాదేవి, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ తోటకూర గ్రేస్ విజయ, వ్యవసాయంలో కొండా ఉషారాణి, ఆర్టీసీలో గండికోట పోలేరమ్మ, పారిశుధ్యంలో నక్క నాగమణిలను నిర్వాహకులు ఘనంగా సత్కరించి సేవా అవార్డులను ప్రదానం చేశారు. సభలో ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కల్యాణి, వరలక్ష్మి, గాయత్రి, జ్యోతి, రోటరీ క్లబ్ సభ్యులు కన్నెగంటి మురళికృష్ణ, పావులూరి రాంబాబు, ఈదర వెంకటపూర్ణచంద్, పి. జగదీశ్వరాంబ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో పొన్నూరు క్రీడాకారుల ప్రతిభ

పొన్నూరు టౌన్, మార్చి 3: పొన్నూరు వైఎస్ఆర్ కరాటే డోజో విద్యారులు జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చూపారు. ఆదివారం చిలకలూరిపేటలో జరిగిన జాతీయస్థాయి కతా, కునితే విభాగాలలో పలు కేటగిరిలలో షేక్ సాజిద్ ఆహీసన్ బంగారు పతకాన్ని సాధించారు. దేవిరెడ్డి సాయిసంతోష్ లోకేష్ సాయి, పఠాన్ సందాని, రేవంత్‌సాయి, సిల్వర్ మెడల్‌ను సాధించగా మోక్షజ్ఞా శ్రీరామచరణ్ మారుతి రుషిక్‌లు కాంశ్యపతకాన్ని సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను పాఠశాల నిర్వాహకులు ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

పొన్నూరు టౌన్, మార్చి 3: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసిన్నట్లు అర్బన్ సీఐ పి.భాస్కర్ ఆదివారం తెలిపారు. నిడుబ్రోలుకు చెందిన సాధుసిలువమ్మ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రాగా సిలువమ్మ గృహంలో సోదాలు నిర్వహించిన్నట్లు చెప్పారు. సిలువమ్మ గృహంలో 12 మద్యం బాటిళ్లను సాధీనం చేసుకొన్ని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ వివరించారు.

సందడిగా పీబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పొన్నూరు టౌన్, మార్చి 3: నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి సహచరులు, ఆత్మీయ పలకరింపులు యోగక్షేమాల నడుమ పీబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. ఆదివారం దొప్పలపూడి రోడ్డులో పీబీఎన్ కళాశాల 1979-82 సంవత్సరాల బీకాం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. 42ఏళ్ల తర్వాత పలు ప్రాంతాలో స్థిరపడిన ఆ నాటి విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్న ఆనాటి మధురస్మృతులను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.గణపతిరావు, అధ్యక్షుడు కె రామ్మోహనరావు, ఎండీ అమీనుల్లా, కె కిషోర్, బాహూజీ, వై శివరామ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.